

వైభవంగా దేవీ నవరాత్రి ఉత్సవాలు

ప్రజాశక్తి- పాడేరు : అల్లూరి జిల్లా కేంద్రం పాడేరు పట్టణంలోఉమా నీలకంఠేశ్వర స్వామి ఆలయం, దుర్గాదేవి ఆలయాల్లో దేవీ నవరాత్రుల ఉత్సవాలు అట్టహాసంగా ప్రారంభించారు, దేవీ నవరాత్రులను పురస్కరించుకొని ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాలను చేపట్టారు. శివాలయంలో ప్రత్యేక మండపాన్ని రూపొందించి దుర్గాదేవి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. శివుడు శ్రీకృష్ణుడు ప్రతిరూపాలతో ప్రత్యేక రీతిలో రూపొందించిన మండపం భక్తులను సందర్శకులను విశేషంగా ఆకట్టుకుంటుంది. దేవీ నవరాత్రుల సందర్భంగా దుర్గా దేవి ఆలయం వద్ద ప్రతిరోజు మధ్యాహ్నం అన్నసమారాధన ఏర్పాటు చేశారు.

ఈనెల 28న ఆదివారం అగ్నిగుండం ఏర్పాటు, భవాని మాలధారులకు సద్ది కార్యక్రమాలు, 29న విద్యార్థులు ఉద్యోగులు, వివిధ వృత్తుల వారికి ఆశీర్వచన కార్యక్రమం, 30న దుర్గాష్టమి అమ్మవారి అంబలం పూజ భవాని భక్తులకు సద్ది ఏర్పాటు, అక్టోబర్ 2న విజయదశమి రోజున దుర్గాదేవి ఉపోత్సవం ఉంటుందని ఆలయ ధర్మకర్త కొత్తగుల్లి సింహాచలం నాయుడు కమిటీ సభ్యులు ఉప్పల వెంకటరత్నం కొత్తగుల్లి రామారావు ఆలయ అర్చకులు ఉప్పల రామం తెలిపారు.

హైడ్రో ఒప్పందాలు

అల్లూరి స్ఫూర్తికి విరుద్ధం

- ★ ప్రాజెక్టులను తక్షణం రద్దు చేయాల్సిందే
- ★ సిపిఎం అల్లూరి జిల్లా కార్యదర్శి అప్పలనర్స
- ★ ఉత్సాహంగా ఆదివాసీ అరణ్య గర్జన జీపుజాతా

ప్రజాశక్తి- గొలుగొండ : అల్లూరి జిల్లాఏజెన్సీ ప్రాంతంలో ప్రతిపాదిత హైడ్రో పవర్ ప్రాజెక్ట్ ఒప్పందం ఆదివాసీల జీవన విధానం, సాంస్కృతిక గుర్తింపు, అల్లూరి సీతారామరాజు స్ఫూర్తికి విరుద్ధంగా ఉందని సిపిఎం జిల్లా కార్యదర్శి పి. అప్పల నర్స విమర్శించారు. కెడి.పేట అల్లూరి పార్కు వద్ద ముందుగా అల్లూరి సీతారామరాజు, గాం గంటం దొర సమాధులకు నివాళిర్పించారు. హైడ్రో పవర్ ప్రాజెక్ట్ ఒప్పందం రద్దుకు అల్లూరి స్ఫూర్తితో పోరాటం చేస్తామని ప్రతిజ్ఞ చేశారు. అనంతరం జిల్లా కార్యదర్శి పి. అప్పల నర్స మాట్లాడుతూ, ఈనెల 22న సీలేరులో ప్రారంభించిన ఆదివాసీ అరణ్య గర్జన జీపు యాత్ర 27న మజ్జివలసలో భారీ బహిరంగ సభతో ముగుస్తుందన్నారు. ఆదివాసీల హక్కులను ఉల్లంఘిస్తూ, పర్యావరణాన్ని నాశనం చేస్తూ, కార్పొరేట్ ప్రయోజనాలకు ప్రాధాన్యత ఇస్తూ ప్రభుత్వాలు చేసుకున్న హైడ్రో పవర్ ప్రాజెక్టు ఒప్పందాలను రద్దు చేయాల్సిందేని స్పష్టం చేశారు. ఆదివాసీల హక్కులకు, వారి భూములు, సంస్కృతికి కాపాడటానికి బ్రిటిష్ వలస పాలనకు వ్యతిరేకంగా పోరాడిన గొప్ప స్వాతంత్ర్య సమరయోధుడు అల్లూరి సీతారామరాజుఅని, ఇపుడు హైడ్రో పవర్ ప్రాజెక్ట్ అల్లూరి స్ఫూర్తికి విరుద్ధంగా, ఆదివాసీల భూములను నవయుగ, మెగా,షిరిడీ సాయి, అదానీ వంటి కార్పొరేట్ సంస్థలకు కట్టబెట్టడం ద్వారా మన్యవాసుల జీవనోపాధిని ధ్వంసం చేయాలని చూస్తున్నారని, ఇది అల్లూరి పోరాట స్ఫూర్తిని అవమానించడమేనని ఆవేదన వ్యక్తం చేశారు. ఎర్రవరం,పెదకోట తదితర ఐదు చోట్ల ప్రతిపాదిత హైడ్రో పవర్ ప్రాజెక్టుకు పదివేల ఎకరాల భూసేకరణ చేయాలని చూస్తున్నారని, దీనివల్ల వేలాది ఆదివాసీ కుటుంబాలు తమ ఆవాసాలు, జీవనోపాధులను కోల్పోయి, అడవులకు దూరమయ్యే పరిస్థితి దుస్థితి నెలకొంటుందని వాపోయారు. పోడు వ్యవసాయం, అటవీ ఉత్పత్తుల సేకరణ, చేపల వేటపై ఆధారపడే ఆదివాసీల జీవనం హైడ్రో ప్రాజెక్టులతో అతలాకుతల మౌతుందని, ప్రాజెక్ట్ వల్ల సహజ వనరులన్నీ నాశనమై, దూరమై, ఆదివాసీలు ఆవాసాన్ని, ఆదాయాన్ని, ఆహార భద్రతను కోల్పోతారని ఆవేదన వ్యక్తం చేశారు. అడవుల నిర్మూలన, నదీ ప్రవాహంలో మార్పులు, జీవవైవిధ్య నష్టం వల్ల పర్యావరణ వ్యవస్థలు ధ్వంసమై, మన్యంలోని అరుదైన జంతు, వృక్ష జాతులను అంతరించే ప్రమాదం ఉందని అప్పలనర్స ఆవేదన వెలిబుచ్చారు.



కేడీ.పేటలో అల్లూరి, గంటం దొర సమాధుల వద్ద నివాళులర్పిస్తున్న అప్పలనర్స తదితరులు



సమగిరిలో అరణ్య గర్జన జాతాలో పాల్గొన్న అప్పలనర్స సిపిఎం నేతలు

ప్రాజెక్టులతో ఆదివాసీల పవిత్ర స్థలాలు, సాంప్రదాయ జ్ఞానం, సామాజిక ఐక్యత దెబ్బతింటాయని, వారి సాంస్కృతిక గుర్తింపును కోల్పోయేలా చేస్తుందన్నారు. అటవీ హక్కుల చట్టం గ్రామసభల అనుమతి లేకుండా భూసేకరణ చట్టాలకు విరుద్ధంగా, మన్యవాసుల మనోభిప్రాయాలను కనీసం పరిగణనలోకి తీసుకోకుండా సాగుతున్న హైడ్రో పవర్ ప్రాజెక్టుల అనుమతులు, ఒప్పందాలు రద్దు చేసే వరకు పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు జీపుయాత్రలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కొర్ర త్రినాథ్, ఆదివాసి గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు సాగిన ధర్మన్న పడాల్, జిల్లా నాయకులు ఎస్.సూరిబాబు, జిల్లా కమిటీ సభ్యులు ఎ.బుజ్జిబాబు, నాయకులు కొర్ర బాలయ్య, వరహాలు, సింహాద్రి, బాబూరావు, జీకే వీధి మండల కార్యదర్శి వి బుజ్జిబాబు, కె.బాలయ్య పాల్గొన్నారు.

హైడ్రోప్రాజెక్టుతో ఆదివాసీల సంస్కృతి నాశనం

కొయ్యూరు: అల్లూరి జిల్లా ఏజెన్సీ ప్రాంతంలో ప్రతిపాదిత హైడ్రోపవర్ ప్రాజెక్ట్‌తో ఆదివాసీల జీవన విధానం, సంస్కృతి నాశనమవుతాయని సిపిఎం జిల్లా కార్యదర్శి పి.అప్పలనర్స విమర్శించారు. హైడ్రోపవర్ ప్రాజెక్టు ఒప్పందాలను రద్దు చేయాలని అరణ్య గర్జన జీపుజాతా మంగళవారం కొయ్యూరు మండలానికి చేరుకుంది. రామరాజుపాలెం మీదుగా గానుగుల వరకూ జీపుజాతా నిర్వహించారు. గానుగులలో భారీ బహిరంగ సభ నిర్వహించారు. అనంతరం గొలుగొండ మండలం కేడి పేట, కొయ్యూరు మండలం చిట్టెంపాడు గ్రామం మీదుగా తులబాడ వెళారు. సాయంత్రం చింతపల్లి మండలం సమగిరి చేరుకుంది. జీపుజాతాలో సిపిఎం జిల్లా నాయకులు ఎస్.సూరిబాబు, కార్యదర్శివర్గ సభ్యులు కొర్ర త్రినాథ్, జిల్లా అధ్యక్షులు సాగిన ధర్మన్నపడాల్, పార్టీ జిల్లా కమిటీ సభ్యులు ఎ.బుజ్జి బాబు, నాయకులు కొర్ర బాలయ్య, వరహాలు, సింహాద్రి, బాబూరావు పాల్గొన్నారు.

ఆదివాసీలను అడవుల నుంచి గెంటేసే కుట్ర

చింతపల్లి : ఆదివాసీలను అడవుల నుండి గెంటివేసే కుట్ర కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చేస్తున్నాయని సిపిఎం జిల్లా కార్యదర్శి పి.అప్పలనర్స అన్నారు. అరణ్య గర్జన జీపు యాత్రలో భాగంగా మంగళవారం మండలంలోని సమగిరిలో ర్యాలీ, బహిరంగ సభ జరిగింది. పార్టీ మండల కార్యదర్శి పాంగి ధనుంజయ్ అధ్యక్షతన జరిగిన ఈ సభలో అప్పలనర్స మాట్లాడుతూ ఎర్రవరం హైడ్రో పవర్ ప్రాజెక్ట్‌కు కేంద్రం, రాష్ట్రం అనుమతులు ఇవ్వడం వెనుక రాజకీయ ప్రయోజనాలు ఉన్నాయని విమర్శించారు. ఆదివాసీల అభిప్రాయం వినకుండా, గ్రామసభ ఆమోదం లేకుండా, పంచాయతీ, మండల, జిల్లా పరిషత్‌ల తీర్మానాలను పట్టించుకోకుండా ప్రాజెక్ట్‌కు పీజుబుల్ రిపోర్ట్ సిద్ధం చేయడం దారుణమన్నారు. ఎర్రవరం హైడ్రో పవర్ ప్రాజెక్ట్‌కు ఇచ్చిన అనుమతులను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు బి.చిన్నయ్య పడాల్ మాట్లాడుతూ, ఎర్రవరం ప్రాజెక్ట్ విషయంలో గత ప్రభుత్వానికీ, ప్రస్తుత ప్రభుత్వానికీ పెద్ద తేడా లేదన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా నాయకులు కొర్ర త్రినాథ్, గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు సాగిన ధర్మన్న పడాల్, నాయకులు సింహాద్రి, వరహాలుబాబు తదితరులు పాల్గొన్నారు.



ధ్వంసమైన వినోద్ ఇల్లు

పథకం ప్రకారమే హత్య

ప్రజాశక్తి -సీలేరు: జికె వీధి మండలం సీలేరు పంచాయతీ స్థానిక వంతల భగత్‌రామ్‌ను వినోద్ అలియాస్ బబుల ఆదివారం పొడిచి చంపిన సంఘటన తెలిసిందే. అయితే భగత్‌రామ్‌ను పథకం ప్రకారమే హత్య చేశాడని కుటుంబ సభ్యులు, బంధువులు ఆరోపించారు. నిందితుడు వినోద్ అలియాస్ బబుల ఇంటిని ధ్వంసం చేశారు. ఒకరిపై ఒకరు కక్షలు పెంచుకుని ఏ క్షణంలో ఎటువంటి సంఘటన చోటు చేసుకుం టుందోనని చింతపల్లి క్యాంపు గ్రామస్తులు భయంతో కంటి మీద కునుకు లేకుండా వణుకుతున్నారు. చింతపల్లి గ్రామ సమీపంలో ఉన్న జీడీసీ క్యాంపులో కొన్నాళ్ల క్రితం రెండు హత్యలు జరిగాయి. నిందితుడు జైలుశిక్ష అనుభవిస్తున్నాడు. ఆ సంఘటన మరువక ముందే ఆదివారం భగత్‌రాము హత్య జరగడంతో గిరిజనుల్లో మరింత భయానక వాతావరణం నెలకొంది. స్థానిక పోలీసులు స్పందించి శాంతిభద్రతలు పరిరక్షించాలని పలువురు కోరుతున్నారు.



తహశీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న కోటం జయరాజు

పోలవరం బాధితులను ఆదుకోవాలి

ప్రజాశక్తి-విఆర్‌పురం: చిన్నమట్టపల్లి పంచాయతీ సర్పంచ్ పిట్ట రామారావు, ఎస్టి సెల్ రాష్ట్ర కార్యదర్శి కోటం జయరాజు మంగళవారం తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ సరస్వతిని కలసి పోలవరం ప్రధాన సమస్య వివరించారు. తదుపరి తహశీల్దార్‌కు వినతిపత్రం అందించారు. తహశీల్దార్ సానుకూలంగా స్పందించి పోలవరం బాధితులను అన్ని విధాలుగా ఆదుకుంటామని హామీ ఇచ్చారు. మడివి బాలరాజు, కట్టి రామారావు, పాయం సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

'పంచాయతీలో ఎటువంటి అవినీతీ జరగలేదు'


ప్రజాశక్తి - విఆర్‌పురం: పెద్దమటపల్లి పంచాయతీలో అవినీతి జరిగిందని సోషల్ మీడియాలో వస్తున్న వార్తలు వాస్తవం కాదని ఎటువంటి అవినీతి జరగలేదని పెద్దమట్టపల్లి సర్పంచ్ వెట్టి లక్ష్మి తెలిపారు. మంగళవారం వార్డు సభ్యులు చిక్కాల పద్మారావు, తుర్రం శాంతమ్మతో కలిసి ఒక ప్రకటన విడుదల చేశారు. కొంతమంది కావాలని అవినీతి ఆరోపణలు చేస్తున్నారన్నారు. గ్రామంలో ఏ పని చేసినా ఆయా అధికారులు చేసిన ఎంబి రికార్డ్ ఆధారంగానే నగదు ఇస్తారు తప్ప ఇష్టానుసారంగా మార్చుకునే పద్ధతి ఇప్పుడు లేదని, నిధుల్ని ప్రజాసమస్యల పరిష్కారానికి ఖర్చుచేశాం తప్ప ఇష్టానుసార పద్ధతిలో వృథా చేయలేదని ఇష్టం వచ్చినట్లు అవమానపరుస్తూ సోషల్ మీడియాలో పోస్టులు పెడితే ఊరుకునేది లేదని హెచ్చరించారు. నూతిగూడెం నుంచి గుర్రంపేట రోడ్డు బాగుచేశామని వాస్తవాలు తెలుసుకోకుండా మాట్లాడడం సరికాదన్నారు.

వదలని వాన

ప్రజాశక్తి-పాడేరు టౌన్: అల్ప పీడన ప్రభావంతో జిల్లాలో వరుణుడు కుండపోత వాన కురిపిస్తున్నాడు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఎండ కాయడం తర్వాత వాతావరణం మారిపోయి ఒక్కసారిగా భారీ వర్షం కురుస్తోంది. నాలుగు రోజులుగా జిల్లాలో ఇదే విధమైన భిన్న వాతావరణంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వీడకుండా కురుస్తున్న వర్షాలకు రోడ్లు దెబ్బతింటున్నాయి వర్షపు నీరు రోడ్డు గుంతల్లో నిలిచిపోవడంతో వాహన రాకపోకలకు చోదకులు పాట్లు పడుతున్నారు. పలు గెడ్డలు పొంగి ప్రవహిస్తున్నాయి. లోతట్టు ప్రాంతాల్లోని వరి పొలాల నీట మునిగి ఇసుక మేటలు వేస్తున్నదని రైతులు వాపోతున్నారు. వ్యవసాయ పనులకు ఆటంకం కలుగుతుందని గిరిజన రైతులు చెబుతున్నారు. పాడేరులో మంగళవారం మధ్యాహ్నం గంటసేపు కుండపోత వర్షం కురిసింది. జనజీవనానికి అంతరాయం ఏర్పడింది. వాహనదారులు లైట్లు వేసుకుని ప్రయాణాలు సాగించారు. పాడేరు పట్టణంలో డ్రైనేజీల నిర్వహణ అస్తవ్యస్తంగా ఉండడంతో పలుచోట్ల డ్రైనేజీల మురుగునీరు రోడ్లపై ప్రవహించింది. పాదచారులు, వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. కొన్ని రోజులుగా మన్యంలో ఇదే పరిస్థితి నెలకొనడం విశేషం



వర్షంతో సుండ్రుపుట్టులో చిత్తడిగా పాడేరు-విశాఖ ప్రధాన రహదారి



గంగులయ్య దంపతులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే శిరీషాదేవి

జానపద కళల పరిరక్షణ అందరి బాధ్యత

- ఎమ్మెల్యే శిరీషాదేవి

ప్రజాశక్తి-రంపచోడవరం : రాష్ట్ర జానపద కళలు సృజనాత్మక అకాడమీ ఛైర్మన్‌గా వంపూరి గంగులయ్య ప్రమాణ స్వీకారం మంగళవారం విజయవాడ హరిత బెర్మ్ పార్క్‌లో అధికారికంగా జరిగింది. కార్యక్రమానికి రంపచోడవరం ఎమ్మెల్యే, రాష్ట్ర ఎస్టీ సంక్షేమ కమిటీ ఛైర్‌పర్సన్ ఎం. శిరీషదేవి, విజయ్ భాస్కర్ హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జానపద కళలు భారతీయ సంస్కృతిలో కీలక స్థానాన్ని దక్కించుకున్నాయని, వాటిని పరిరక్షించడం అందరి బాధ్యత అని తెలిపారు. ఏజెన్సీ ప్రాంతానికి చెందిన వ్యక్తి అకాడమీ ఛైర్మన్‌గా నియమించబడటం గిరిజన సమాజానికి ప్రభుత్వ గుర్తింపని శిరీషదేవి అభిప్రాయపడ్డారు. వంపూరి గంగులయ్య దంపతులను సన్మానించారు. కార్యక్రమంలో పర్యాటకశాఖ మంత్రి కందుల దుర్గేష్, రంపచోడవరం జనసేన నియోజకవర్గ పాయింట్ ఆఫ్ కాంటాక్ట్ రాజశేఖరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మ్యూటేషన్లను వేగవంతం చేయాలి

- విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే ఉపేక్షించం
- అధికారులతో సమీక్షలో జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్

ప్రజాశక్తి - పాడేరు: మ్యూటేషన్ల పనులు వేగవంతం చేయాలని, సంతృప్తికరమైన సేవలు అందించి, పిజిఆర్ఎస్ ఫీడ్ బ్యాక్‌పై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ ఎ.ఎస్ దినేష్ కుమార్ అధికారులను ఆదేశించారు. మంగళవారం జిల్లా కలెక్టర్ కార్యాలయ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి ఐటిడిఎ ఐటిడిఎ పిఒ తిరుమణి శ్రీపూజ, సబ్ కలెక్టర్లు, 22 మండలాల రెవెన్యూ అధికారులతో రేషన్ కార్డు సర్వీసెస్, రెవెన్యూ సదస్సులు, హౌసింగ్, పిబిఎస్-ఎల్ఎ సర్వీసెస్, ఎపి సేవాపోర్టల్, క్యాస్ట్ సుమోటో డ్రైవ్, రెవెన్యూ తదితర అంశాలపై కలెక్టర్ వీడియో కాన్ఫరెన్సు నిర్వహించారు. పెండింగ్‌లో ఉన్న మ్యూటేషన్‌లపై మండలాలవారీగా సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పెండింగ్ మ్యుటేషన్లకు ప్రణాళికలు రూపొందించి త్వరితగతిన పరిష్కారం చూపాలని అధికారులను ఆదేశించారు. రీసర్వే పురోగతిపై ఆరా తీశారు. ప్రణాళికలు వేసుకొని పనుల పురోగతికి చర్యలు చేపట్టాలన్నారు. అటవీ, రెవెన్యూకు సంబంధించిన భూముల రీ రీసర్వే కోసం ఒక కమిటీ వేయాలన్నారు. అనంతరం పిజిఆర్ఎస్ నిర్వహణ కలెక్టర్ మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న పిటిషన్లన్నీ వారం రోజుల్లో పరిష్కరించాలన్నారు.సరిగా పర్యవేక్షించకుండా గ్రీవెన్స్ ముగించినా, అర్జీదారునితో సంబంధిత గ్రీవెన్స్ రెడ్రెస్సెల్ అధికారి మాట్లాడకపోయినా సంబంధిత అధికారిపై చర్యలు తప్పవని కలెక్టర్ హెచ్చరించారు. పిజిఆర్ఎన్, రెవెన్యూ సమస్యలు పరిష్కారానికి తాహశీల్దారులు చొరవ చూపించాలన్నారు. చౌకధర దుకాణల పరిశీలనపై ఆరాతీశారు. ఇంటి స్థలం కావాలని దరఖాస్తూ చేసుకున్న వారి వివరాలపై ఆరాతీసి, నేటికీ ఇంటి స్థలం మంజూరు కాకపోవడానికి కారణాలపై, పనుల పురోగతిపై ఆసహనం వ్యక్తం చేశారు. నెల రోజుల్లోగా అర్హులను గుర్తించి ఇంటి స్థలం మంజూరు వేగవంతం చేయాలని ఆదేశించారు. ప్రభుత్వ భూములు పరిరక్షణ చర్యలు చేపట్టాలన్నారు. ప్రభుత్వ భూములు కబ్జాకు గురికాకుండా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇళ్ల పట్టాలు లేని వారికీ పట్టాలు అందించే దిశగా చర్యలు చేపట్టాలన్నారు. పనులు పురోగతి కావాలంటే అధికారులు గ్రామాల్లో పర్యటించాలన్నారు.

ఎపి సేవా పోర్టల్‌లో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులపై ఆరా తీశారు. సమస్యల పరిష్కారానికి ఫీడ్ బ్యాక్ కీలకమని, విధి నిర్వహణలో అలసత్వంవహిస్తే ఉపేక్షించేది లేదన్నారు. పౌర సరఫరాల విభాగానికి సంబంధించి పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులు గ్రామ స్థాయిలో పరిష్కారం అయ్యేలా చర్యలు చేపట్టాలన్నారు. కొత్త రేషన్ కార్డుల మంజూరు పై సమీక్షించారు. ప్రభుత్వ శాఖలకు ఏవైనా భూములు అప్పగించినట్లయితే ఆ భూములు ప్రభుత్వ శాఖల అధీనంలో లేకుండా వేరేవరి అన్యాక్రాంతంలో ఉన్నట్లు ఐతే, గడచిన మూడేళ్లకు సంబంధించి హ్యాండ్ ఓవర్ చేసిన భూములు వివరాలు క్షేత్ర స్థాయిలో నిశితంగా పరిశీలించి నివేదికలు పంపించమని తహసీల్దార్లకు ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్సులో డిఆర్ఓ కె. పద్మలత, ప్రత్యేక ఉప కలెక్టర్, పిజిఆర్ఎస్ నోడల్ ఆఫీసర్ ఎం.వి.ఎస్ లోకేశ్వర రావు, వర్చువల్గా రంపచోడవరం సబ్ కలెక్టర్ కల్పశ్రీ పాల్గొన్నారు.

8 గంటల పని విధానం కొనసాగించాలి

సిఐటియు జిల్లా కార్యదర్శి పల్లపు వెంకట్



ఐటిడిఎ ఎదుట నిరసన తెలుపుతున్న సిఐటియు జిల్లా కమిటీ నాయకులు



రాజవొమ్మంగిలో నిరసన తెలుపుతున్న కార్మికులు

ప్రజాశక్తి-రంపచోడవరం : కార్మికులకు 8 గంటల పనివిధానం కొనసాగించాలని సిఐటియు జిల్లా కార్యదర్శి పల్లపు వెంకట్ డిమాండ్ చేశారు. అసెంబ్లీలో ప్రవేశపెట్టిన కార్మిక చట్టాల సవరణ బిల్లుకు వ్యతిరేకంగా రంపచోడవరంలో సిఐటియు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిల్లులో భాగంగా పనిగంటలను 8 నుంచి 10-13 గంటలకు పెంచడంతో పాటు మహిళలను రాత్రిపూట పరిశ్రమల్లో, సంస్థల్లో పనిచేయిం చేందుకు అనుమతించినందుకు కార్మిక నాయకులు తీవ్రంగా అభ్యంతరం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షురాలు మట్ల వాణిశ్రీ, గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు సిరిమల్లి రెడ్డి, సిఐటియు మండల నాయకులు కారం రామలక్ష్మి, చెల్లయ్యమ్మ, విఒఎ జిల్లా నాయకులు రామకృష్ణ, చందు, సింహ తదితరులు పాల్గొన్నారు.

రాజవొమ్మంగి: అసెంబ్లీలో బిల్లును వ్యతిరేకిస్తూ సిఐటియు రంపచోడవరం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో రాజవొమ్మంగిలో నిరసన కార్యక్రమం చేపట్టారు. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు రామరాజు మాట్లాడుతూ పెంచిన పనిగంటల తీర్మానాన్ని ప్రభుత్వం తక్షణం ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అంగన్వాడి యూనియన్ జిల్లా నాయకులు కె.వెంకటలక్ష్మి, కుమారి, భవన నిర్మాణ సంఘం మండల నాయకులు ఎస్.వీరబాబు, ఇతర ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.

సీలేరు: ఎనిమిది గంటల పనిదినాలను రద్దు చేయడం దుర్మార్గమని సిపిఎం జిల్లా అధ్యక్షుడు బోనంగి చిన్నయ్యపడాల్ విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం ఎనిమిది గంటల పని విధానం అమలు చేయాలని లేకపోతే తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ బ్రాంచ్ అధ్యక్ష కార్యదర్శులు లక్ష్మణ్ విష్ణుకుమార్, సిఐటియు గౌరవ అధ్యక్షులు ఎస్కే శుభాన్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎపిడి శ్రీనివాస్

'ఉపాధిహామీ'లో

వెదురు పెంపకం

ప్రజాశక్తి-మారేడుమిల్లి : ఏజెన్సీ ప్రాంతంలో ఉపాధి హామీ చట్టం సహకారంతో వెదురు మొక్కల పెంపకానికి కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ప్రాధాన్యం కల్పిస్తున్నాయని భూమి ఉండి ఉపాధి హామీ జాబ్‌కార్డు ఉన్నవారు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని డ్వామా అసిస్టెంట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ తూతిక శ్రీనివాసవిశ్వనాథ్ తెలిపారు. మంగళవారం స్థానిక అడిషనల్ ప్రోగ్రాం అధికారి కార్యాలయంలో ఉపాధి, వెలుగు సిబ్బందితో సమీక్ష నిర్వహించి అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలంలో సుమారు 300 ఎకరాల్లో 1000 మంది లబ్ధిదారులకు ఉపయోగపడేలా వెదురు మొక్కల పెంపకం చేపట్టాలన్నారు. ఇప్పటికే కలెక్టర్ దినేష్‌కుమార్ లబ్ధిదారులను గుర్తించాలని ఆదేశించారన్నారు. సమావేశంలో ఎపిఒ మాణికుమారి, ఎపిఎం డిఆర్‌డిఎ దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుప్రమాదంలో యువకుడు మృతి

ప్రజాశక్తి -కొయ్యూరు : సింగవరం గ్రామానికి చెందిన పాంగి అఖిల్ (23) కేడీపేట నుండి నుంచి కొయ్యూరు బైక్‌పై వేగంగా వస్తుండగా కాకరపాడు సమీపంలో బైక్ అదుపుతప్పి ప్రమాదానికి గుర య్యాడు. ఈ ప్రమాదంలో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. కొయ్యూరు ఎస్సై కిషోర్‌వర్మ కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

'డ్రగ్స్ జోలికెళితే కఠినచర్యలు'

ప్రజాశక్తి -సీలేరు: యువత మత్తు పదార్థాలు విడనాడాలని వారిలో తక్షణమే పరివర్తన రావాలని లేనిపక్షంలో కఠినచర్యలు తీసుకుంటామని సిఐ వరప్రసాద్ హెచ్చరించారు. జికె వీధి మండలం సీలేరులో మంగళవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌కు యువకులకు పిలిపించి కౌన్సెలింగ్ నిర్వహించారు. గంజాయి తాగుతూ విచ్చలవిడిగా తిరగడం హత్యలు, చోరీలు చేస్తూ మిగతావారికి ఇబ్బందులకు గురిచేస్తే సహించేది లేదన్నారు. సీలేరు పోలీస్‌స్టేషన్ పరిధి నాలుగు పంచాయతీలో ఇకపై ప్రతివారం గంజాయి వినియోగిస్తున వారిపై నిఘా పెడుతూ వారికి కౌన్సిలింగ్ ఇస్తామని తెలిపారు. ఎస్సై రవీంద్ర సిబ్బంది పాల్గొన్నారు.

వీధిలైట్లు ఏర్పాటు


ప్రజాశక్తి-రాజవొమ్మంగి: పంచాయతీలో రెండు సచివాల యాల పరిధిలో లైన్‌మెన్‌ను నియమించాలని రాజవొమ్మంగి సర్పంచ్ గొల్లపూడి రమణి, ఎపిఐఐసి డైరెక్టర్ పెద్దిరాజు మంగళవారం కోరారు. ప్రైవేట్‌వ్యక్తులతో మంగళవారం వీధిలైట్లు వేయించారు. ఎంపిడిఒ, జిల్లా కలెక్టర్ దృష్టికి సమస్య తీసుకువెళ్లామన్నారు. ఉన్నతాధికారులు స్పందించి లైన్‌మెన్‌ని నియమించాలని కోరారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సంధ్య సచివాలయ సిబ్బంది ఉన్నారు.

ఏజెన్సీలో భారీ వర్షం

ప్రజాశక్తి -సీలేరు: జికె వీధి మండలం సీలేరులో మంగళవారం ఉదయం 11 గంటల నుంచి నాలుగు గంటల వరకు ఏకధాటిగా భారీ వర్షం కురిసింది. రహదారులు డ్రైనేజీల్లో వర్షం నీరు పొంగి ప్రవహించింది. లోతట్టు ఇళ్లల్లోకి నీరు చేరడంతో గిరిజనులు నానా ఇబ్బందులు పడ్డారు. 15 రోజులుగా వర్షాలు లేక వరి పొలాలు బీటలు వారే పరిస్థితి నెలకొనడంతో రైతులు ఆందోళన చెందారు. వర్షం కురవడంతో హర్షం వ్యక్తం చేశారు.

మెకానిక్ షాపులో చోరీ

ప్రజాశక్తి -సీలేరు: కాళిదాసు మేస్త్రి బైక్ మెకానిక్ షాపులో గుర్తు తెలియని దుండగులు రూ.30 వేల విలువైన సామగ్రిని అపహరించుకుపోయిన సంఘటన సోమవారం రాత్రి చోటుచేసుకుంది. జికె వీధి మండలం ధారకొండ పంచాయతీ పరిధి దెబ్బకోట గ్రామం మాయాబజార్ జంక్షన్‌లో ఒకేరోజు దుండగులు చోరికి పాల్పడి విలువైన రెంచీలు, హోమ్‌థియేటర్ మిషన్లు అపహరిం చుకుపోయారు. దుకాణం షట్టర్ తొలగించి లోపలికి ప్రవేశిస్తున్న దృశ్యాలు సిసి ఫుటేజ్‌లో రికార్డ్ అయ్యాయి. అనంతరం సిసి కెమెరాలు ఉన్నట్టు అగంతకులు గుర్తించి వాటిని ధ్వంసం చేశారు. సోమవారం రాత్రి 11 గంటలకు షట్టర్ తాళాలు పగలగొట్టి చాకచక్యంగా లోనికి ప్రవేశించారు. దొంగలు దుకాణంలోకి ప్రవేశించిన కొంతసేపటి తర్వాత లోపల నుంచి చప్పుడు రావడంతో సమీపంలోని ఇంటిలో ఉన్న కృష్ణకు మెలకువ వచ్చింది. కేకలు వేయడంతో దుండగులు తప్పించుకొని పారిపోయారు. ఎస్ఐ రవీంద్రను వివరణ కోరగా చోరీ జరిగినట్టు తెలుస్తోందని బాధితుడు తమకు ఎటువంటి ఫిర్యాదు ఇవ్వలేదని తెలిపారు.



సిసి పుటేజీలో రికార్డయిన దృశ్యం

ఆదివాసీలను జల సమాధి చేసే

హైడ్రో పవర్ ప్రాజెక్టులను రద్దు చేయాలి

- ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లో సురేంద్ర
- పలుచోట్ల రౌండ్ టేబుల్ సమావేశాలు
- 27న మజ్జివలసలో అరణ్య గర్జన సభ బహిరంగ జయప్రదానికి పిలుపు


హుకుంపేటలో రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న సురేంద్ర

ప్రజాశక్తి- హుకుంపేట: ఆదివాసీలను జలసమాధి చేసే హైడ్రో పవర్ ప్రాజెక్టు ఒప్పందాలు రద్దు చేయాలని, ఈ ప్రాజెక్టుల పేరుతో ఆదివాసుల హక్కులను హరించడం దుర్మార్గమని ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లో సురేంద్ర ధ్వజమెత్తారు. మంగళవారం హుకుంపేట మండల కేంద్రంలో బూర్జ పంచాయితీ పోరాట కమిటీ కన్వీనర్ మజ్జి సురేష్‌కుమార్, కో కన్వీనర్ తావుల కృష్ణారావు, కో కన్వీనర్ మజ్జి కృష్ణంరాజు ఆధ్వర్యంలో ప్రజా సంఘాలు, హైడ్రో ప్రాజెక్టు బాధిత గ్రామాల ప్రజలతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. మండలంలోని బూర్జం మజ్జివలస గ్రామంలో ఈనెల 27న జరగనున్న అరణ్య గర్జన సభ విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా సురేంద్ర మాట్లాడుతూ అడవులపై ఆదివాసీలని కేవలం సామాజిక హక్కులు మాత్రమే కాదని, భారత రాజ్యాంగ ఆత్మలో భాగమనిస్పష్టం చేశారు. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు జిఒ51 ద్వారా ఆదివాసి వ్యతిరేక నిర్ణయాలు తీసుకుంటున్నాయని విమర్శించారు. చిట్టంవలస (900 మెగావాట్స్), పెద్దకోట (2400), గుజ్జలి (2400), ఎర్రవరం (1800), సీలేరు (900) ప్రాంతాల్లో హైడ్రో పవర్ ప్రాజెక్టులు నిర్మిస్తే ఆదివాసుల జీవన ఉపాధులు నాశనమౌతాయనిఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి వి. లక్ష్మణ్ రావు,ఆదివాసి మహిళ సంఘం జిల్లా కార్యదర్శి ఎస్ హైమావతి, నాయకులు అప్పలకొండ పడాలి, కృష్ణమూర్తి, సూపర్ సర్పంచ్ పాంగి బొంజుబాబు పరుశు రాం నరేంద్ర బాలరాజ్ కృష్ణ కుమార్‌రాజు గణేష్, వ్యతిరేక పోరాట కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

అరకులోయ: హైడ్రో పవర్ ప్రాజెక్ట్ ఒప్పందాలు జిఒ13, 51 తక్షణమే రద్దు చేస్తూ అసెంబ్లీలో రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రకటన చేయాలని ఆదివాసి గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పొద్దు బాలదేవ్ పిలుపునిచ్చారు. ఆదివాసి గిరిజన సంఘం, హైడ్రోపవర్ ప్రాజెక్ట్ వ్యతిరేక పోరాట కమిటీ ఆధ్వర్యంలో ఈనెల 27న తేదీన హుకుంపేట మండలం బూర్జ పంచాయతీ మజ్జివలసలో అరణ్యగర్జన సభకు వేలాదిగా ఆదివాసీ ప్రజానీకం వేలాదిగా తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు.మంగళవారం అరకువ్యాలిలో పోరాట కమిటీ బస్కి కన్వీనర్ బురిడీ దశరథ్ అధ్యక్షతన రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. రౌండ్ టేబుల్ సమావేశంలో హైడ్రో పవర్ ప్రాజెక్ట్ పోరాట కమిటీ నాయకులు పాంగి నాగేశ్వరరావు,ఆదివాసి గిరిజన సంఘం మండల కార్యదర్శి గతం బుజ్జిబాబు, మండల నాయకులు కిల్లో ముకుంద్, సహదేవ్, పిసా కమిటీ నాయకులు కిల్లో జగన్నాథం, కాఫీ రైతు సంఘం మండల కార్యదర్శి సిహెచ్ గురుమూర్తి,కార్మిక సంఘం నాయకుడు సాయి, నాని బాబు, ఆదివాసి కళాకారుల సంఘం జిల్లా అధ్యక్షులు తామల జోషి, సిపిఎం మండల కార్యదర్శి కిండంగి రామారావు, ఆదివాసి యువజన సంఘం నాయకులు అప్పలస్వామి పాల్గొన్నారు.



అరకులో మాట్లాడుతున్న బాలదేవ్

డుంబ్రిగుడ: అల్లూరి జిల్లాలో 30కేంద్రాలలో హైడ్రో పవర్ ప్రాజెక్టు ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం నవయుగ, అదానీ బడా కార్పొరేట్ కంపెనీలకు ఇచ్చిన అనుమతుల జిఒ 51 వెంటనే రద్దు చేయాలని సిపిఎం గసభ పంచాయతీ సర్పంచ్ పి సునీత డిమాండ్ చేశారు. ఆదివాసీల జీవనానికి, మనుగడకు, చట్టాలకు విరుద్ధంగా ఒప్పందాలు చేసుకోవడం దుర్మార్గమన్నారు. గిరిజన ప్రాంతంలో భూములు, వనరులు, సంపదను దోచుకొని పోతుంటే ఊరుకోబోమని హెచ్చరించారు. కార్యక్రమంలో గసబ మాజీ సర్పంచ్ పాంగి. సురేష్ కుమార్, పాంగి. సత్యనారాయణ, పాంగి. రాజ్ కుమార్, పాంగి. గోపాల్, వంతాల. రాములమ్మ గెమ్మిలి. మోహన్ దాస్ పాల్గొన్నారు.

వేంగ్డలో అదానీ దిష్టిబొమ్మ దహనం

అనంతగిరి : ఆదివాసి హక్కులు చట్టాలను తుంగలో తొక్కి అదానీ నవయుగ సంస్థలకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు హైడ్రో పవర్ ప్రాజెక్టులను కట్టబెడుతూ జారీ చేసిన జిఒలు 13, 51 తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ వేంగ్డలో జిఒ కాపీలను, అదానీ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. హైడ్రో ప్రాజెక్టు వ్యతిరేక పోరాట కమిటీ. నేత, ఆదివాసీగిరిజన సంఘం మండల అధ్యక్షులు, వెంగడ మాజీ సర్పంచ్ సివేరి. కొండలరావు ఆధ్వర్యంలో నిరసనలో పోరాట కమిటీ సభ్యులు సాలెపు లచ్చన్న, మజ్జి .సింహాద్రి. కల్యాణ్, రాము,కేశవ్, దసాయసాగర్, మజ్జి రాజు, బుట్టన్న, అప్పన్న, రాము, రామారావు, పెద్దసంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.


మజ్జివలసలో జిఒ ప్రతులు, అదాని దిష్టిబొమ్మను దగ్ధం చేస్తున్న ఆదివాసులు


ప్రత్యామ్నాయ పంటలపై అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారులు

ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి

ప్రజాశక్తి ముంచింగిపుట్టు : గంజాయిని కాదని ప్రత్యామ్నాయ పంటలపై గిరిజన రైతులు దృష్టిసారించాలని మండల వ్యవసాయ శాఖ అధికారి మురళీకృష్ణ కోరారు. మంగళవారం మండలంలోని మాకవరం సచివాలయ పరిధిలోని మాకవరం, కుంబ్రిపాడ గ్రామ రైతులతో అవగాహన సదస్సులు నిర్వహించారు.. ఈ సందర్భంగా మాట్లాడుతూ నిత్యవసర సరుకులుగా వినియోగిస్తున్న పంటల ఉత్పత్తికి రైతులు మొగ్గు చూపాలని, తద్వారా అధిక లాభాలు పొందవచ్చన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రైతులకి 90 శాతం రాయితీపై రాజ్మా విత్తనాలు పంపిణీ చేసిందని వాటిని సక్రమంగా వినియోగించాలన్నారు. గంజాయి సాగువంటి చట్ట వ్యతిరేక కార్యక్రమాలను పాల్పడి జీవితాలను నాశనం చేసుకోవద్దని, గంజాయి పండించడం, రవాణా చట్టరీత్యా నేరమని,నూతన చట్టాలతో వీరికి కఠినమైన శిక్షలు ఉంటాయని హెచ్చరించారు. తక్షణ ప్రయోజనం, ప్రలోభాలకు లొంగి గిరిజన యువత గంజాయి కేసుల్లో ఇరుక్కుంటున్నారన్నారు. కార్మికులు, రైతులు, యువత చైతన్యవంతులై అసాంఘిక కార్యక్రమాలకు దూరంగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది ఝాన్సీ రాణి, కృష్ణ, రాము నాయుడు ,రైతులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

బరిస్టా కాఫీ తయారీపై గిరిజన యువతకు శిక్షణ

ప్రజాశక్తి అరకు లోయ: అల్లూరి జిల్లాలోని అరకు ప్రాంత గిరిజన యువతకు బరిస్టా కాఫీ తయారీపై శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నామని జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి డాక్టర్ పి. రోహిణి తెలిపారు. ఈ నెల23 నుంచి 27 వరకు అరకు వైటిసిలో శిక్షణ కార్యక్రమాన్ని మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాల మేరకు కాఫీ బోర్డు ఆఫ్ ఇండియాతో సంప్రదింపులు జరిపి శిక్షణ కార్యక్రమం నైపుణ్యాభివృద్ధి కార్పొరేషన్ ద్వారా వారికి ప్రయోజనం కల్పిస్తారన్నారు. ముఖ్యమంత్రి వంజంగి పర్యటన సందర్భంగా స్టేట్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ వ్యవస్థాపక మార్గదర్శకాలు, నిరుద్యోగ యువతకు స్థిరమైన ఉపాధి అవకాశాలను సృష్టించడానికి కాఫీపై నైపుణ్య శిక్షణ ఇవ్వాలని ఆదేశించారన్నారు. ముఖ్యమంత్రి సూచనల మేరకు కాఫీ బోర్డు సహకారంతో ఐదు రోజుల శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ శిక్షణతో గిరిజన యువతను పరిశ్రమ సంబంధిత నైపుణ్యాలతో శక్తివంతం చేయొచ్చన్నారు. కాఫీ రంగంలో భవిష్యత్తును నిర్మించుకునే అవకాశం లభిస్తుందన్నారు.కార్యక్రమంలో కాఫీ బోర్డ్ ట్రైనర్ యతిష్ గౌడ్ గవర్నమెంట్ ఐటిఐ కాలేజీ ప్రిన్సిపాల్ వై ఉమా శంకర్, అరకు, గోపాల్ రావు, సబ్ ఇన్స్పెక్టర్ అఫ్ పోలీస్ అరకు, నైపుణ్యాభివృద్ధి సిబంది నవీన్, మధు, ప్రసాద్ పాల్గొన్నారు.

మాడగడ వ్యూపాయింట్ వద్ద ఉయ్యాల తొలగింపు అన్యాయం

ప్రజాశక్తి అరకులోయ రూరల్: మండలంలోని మాడగడ సన్ రైజ్ పాయింట్‌లో గిరిజనులు స్వయం ఉపాధికి ఏర్పాటు చేసిన ఉయ్యాలలను అటవీశాఖ అధికారులు మంగళవారం తొలగించారు. దీనిపై గిరిజనులు మండిపడ్డారు. మాడగడ సన్రైజ్ పాయింట్, పాల సముద్రంలా తలపించే పొగ మంచు తిలకించేందుకు దేశ విదేశాల నుండి అధిక సంఖ్యలో వచ్చే పర్యాటకులను నమ్ముకుని ఎంతోమంది గిరిజనులు ఉపాధి పొందుతున్నారు. అయతే ఎకో టూరిజం పేరుతో ఆటవీశాఖ అధికారులు దౌర్జన్యంగా గిరిజనులు కర్రలతో ఏర్పాటు చేసిన ఉయ్యాలలను తొలగించడంపై గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనికి వ్యతిరేకంగా సర్పంచ్ అధ్యక్షతన గ్రామసభ నిర్వహించి,వార్డు సభ్యులు, పీసా కమిటీ సభ్యులు తీర్మానం చేశారు. అయినప్పటికీ అటవీశాఖ అధికారులు దౌర్జన్యంగా ఉయ్యాలలను తొలగించడం సరికాదని, పంచాయతీ ఆధ్వర్యంలో వ్యూ పాయింట్ కొనసాగించేలా చర్యలు చేపట్టాలని బాధిత గిరిజనులు కోరుతున్నారు.


వ్యూపాయింట్‌లో ఉయ్యాలను తొలగిస్తున్న అటవీ సిబ్బంది

ప్రభుత్వ ప్రాధాన్యతాంశాలపై దృష్టి

అధికారులకు జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ ఆదేశం

ప్రజాశక్తి- పాడేరు: జిల్లా సమగ్రాభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వ ప్రాధాన్యతాంశాలపై అధికార యంత్రాంగం దృష్టి సారించి కృషి చేయాలని జిల్లా కలెక్టర్ ఎఎస్.దినేష్ కుమార్ స్పష్టం చేసారు. మంగళవారం కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్సు మందిరంలో డిఆర్‌డిఎ, ఇరిగేషన్, బ్యాంకింగ్, లేబర్, డ్వామా, జిఎస్‌డబ్ల్యు, పంచాయతీరాజ్ శాఖలపై జిల్లా అభివృద్ధిపై సమావేశం నిర్వహించారు. పిజిఆర్‌ఎస్‌లో పెండింగ్‌లో ఉన్న పిర్యాదులు త్వరితగతిన పూర్తిచేయాలన్నారు. ముందుగా జిల్లా గ్రామీణభివృద్ధి సంస్థ చేపడుతున్న వివిధ కార్యక్రమాలపై సమీక్షించారు. మొండిబకాయిలు క్లియర్ అయితే కొత్త రుణాల మంజూరుకు లక్ష్యాలను నిర్ధేశించుకుని రుణ వసూళ్లను వేగవంతం చేయాలన్నారు. మండల అభివృద్ధి అధికారులు సంబంధిత సిబ్బందితో సమావేశాలు ఏర్పాటు చేయనుకోవాలన్నారు. డిజిటల్ ద్వారా బ్యాంక్ లింకేజి చేయాలన్నారు. డ్వామా సమీక్షలో ప్రాజెక్ట్ అధికారి డాక్టర్ విద్యాసాగర్ చేపట్టిన పనులు వివరించారు. పనికి ఆహార పథకం పనులు ఎలా మంజూరు చేయాలో ప్రణాళికలు చేసుకోవాలన్నారు. చేసిన పనులు పూర్తి నాణ్యత ఉండేలా చూడాలన్నారు. మండల స్థాయిలో మొక్కలు నాటే కార్యక్రమానికి సంబంధించి మొక్కలు పంపిణి, చేపట్టిన పనులు వివరించారు. 30వేల ఎకరాల్లో పూర్తి స్థాయిలో మొక్కలు నాటే కార్యక్రమం పూర్తి స్థాయిలో జరగాలన్నారు. ముఖ్యమంత్రి కలెక్టర్ కాన్ఫిరెన్స్‌లో నిర్దేశించిన అంశాలపై సమీక్షించారు. భూగర్భజలాల వృద్ధి, డ్వామా డ్రింకింగ్ వాటర్, ఇరిగేషన్ శాఖలు కలసి ఒక బృందంగా ఏర్పాటు అయి ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. ఆర్‌డబ్ల్యూజె పనులపై సమీక్షించారు. నేటికీ పూర్తయిన హర్‌ఘర్ జల్ పనులు వివరించారు. మండలాల వారీగా చేపట్టిన పనులపై మండల డిఈ, జెఇలతో మాట్లాడి ఆరాతీశారు. నేటికీ ప్రారంభం కానీ పనులు ప్రారంభం అయ్యేలా చర్యలు చేపట్టాలన్నారు. పంచాయతీరాజ్ శాఖలపై ఇకెవైసి, కౌశల్‌పై సమీక్షించారు. ఎంపిడిఒలు వారాంతపు సమీక్షలో ఇకెవైసి ప్రాధాన్యత కల్పించాలన్నారు. ఆటో డ్రైవర్ సేవలకు లబ్ధిదారుల పెండింగ్ లో ఉన్న దరఖాస్తూలు వెరిఫికేషన్ పూర్తి చేయాలన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ డాక్టర్ ఎం.జె. అభిషేక్ గౌడ, ఐటిడిఎ పిఒలు తిరుమణి శ్రీపూజ, స్మరణ్ రాజ్, అపూర్వ భరద్వాజ్, డ్వామా ప్రాజెక్ట్ అధికారి డాక్టర్. విద్యాసాగర్ (వర్చువల్), పిజిఆర్‌ఎస్ నోడల్ ఆఫీసర్ ఎంవిఎస్ లోకేశ్వర రావు, డిఆర్‌డిఎ పీడీ మురళీ, సిపిఒ ప్రసాద్, డిఎపిఒ పిఎస్ కుమార్, వ్‌ల్‌డిఎం పిఎం.నాయుడు, డిపిఒ కె.పి.చంద్రశేఖర్ పాల్గొన్నారు..

గంగులయ్యకు జనసేన శ్రేణుల శుభాకాంక్షలు

ప్రజాశక్తి-చింతపల్లి : జానపద కళలు, సృజనాత్మక అకాడమీ చైర్మన్‌గా మంగళవారం బాధ్యతలు స్వీకరించిన జనసేన పార్టీ అరకు పార్లమెంట్ ఇన్‌ఛార్జి డాక్టర్ వంపూరు గంగులయ్యకు ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు గొర్ల వీర వెంకట్, సుర్ల వీరేంద్రకుమార్, గాజుల శ్రీను, పోటుకూరి జయరాజ్ తదితరులు పాల్గొన్నారు.


గంగులయ్యను సన్మానిస్తున్న జనసేన నాయకులు


మాట్లాడుతున్న సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లపు వెంకట్

వెలుగు యానిమేటర్లపై పనిభారం తగ్గించాలి

ప్రజాశక్తి-రంపచోడవరం : వెలుగు యానిమేటర్లపై పనిభారం తగ్గించాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లపు వెంకట్ అన్నారు. రంపచోడవరం సిఐటియు కార్యాలయంలో మంగళవారం అరగాటి రామకృష్ణరెడ్డి అధ్యక్షతన విఒఎల జిల్లా కమిటీ సమావేశం జరిగింది. వెలుగు యానిమేటర్లపై పనిభారం తగ్గించి వారి సమస్యలు పరిష్కారం చెయ్యాలని యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా అక్టోబర్ 1 నుంచి ఆన్‌లైన్ సేవలు బంద్ చేస్తునట్టు విఒఎల జిల్లా కమిటీలో నిర్ణయించారు. సమావేశానికి సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లపు వెంకట్ ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విఒఎల సమస్యలు పరిష్కారం కావాలంటే అందరూ సంఘటితమై ఐక్యఉద్యమాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. విఒఎల మండల, జిల్లా, రాష్ట్ర మహాభలను సిఐటియు అల్ ఇండియా మహాసభలను కార్మికులంతా విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిఐటియుజిల్లా అధ్యక్షులు మట్ల వాణిశ్రీ నరసింహ, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



కల్యాణ్‌కు స్వాగతం పలుకుతున్న అభిమానులు

వరల్డ్ మెగా మారథాన్ విజేత కల్యాణ్ కూరపాటి

ప్రజాశక్తి- ఎంవిపి కాలనీ : సెప్టెంబర్ 20న జర్మనీలోని బెల్జియం నగరంలో జరిగిన వరల్డ్‌మెగా మారథాన్‌లో ఆంధ్రప్రదేశ్ తరపున పాల్గొన్న కూరపాటి కల్యాణ్ ఇన్‌లైన్ స్పీడ్‌లో 42 కిలోమీటర్ల మరధాన్ పరుగును సకాలంలో పూర్తిచేసి విజేతగా నిలిచాడు. ప్రపంచవ్యాప్తంగా 151 దేశాల నుండి 80 వేల మంది క్రీడాకారులు పాల్గొన్న ఈ పోటీలో 8వేల మంది విజేతలుగా నిలవగా ఆంధ్రప్రదేశ్ తరపున ప్రాతినిధ్యం వహించిన 54 ఏళ్ళ కళ్యాణ్ తన లక్ష్యాలను సాధించారు. ఆయన విశాఖపట్టణం వుడా పార్కులో కోచ్‌గా ఉంటూ వేలాది మందికి స్కేటింగ్‌లో శిక్షణ ఇస్తూ జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పలువురు క్రీడాకారులను తీర్చిదిద్దారు. పెద్దవాల్తేరులోని సన్‌ఫ్లవర్ విద్యాసంస్థల అధినేతగా రోలర్‌స్పోర్ట్స్ అకాడమీ వ్యవస్థాపకులుగా ఉన్నారు. ఆయన ఇప్పటికే ఇండియన్ స్కేటింగ్ మాజీకోచ్ జాతీయస్థాయిలో పలు పతకాలు సాధించారు. ఆయన విజయం పట్ల విశాఖ డిస్ట్రిక్ట్ రోలర్‌స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షులు రామచంద్ర, ఉపాధ్యక్షులు కరణం గంగాధర్, జాయిం ట్ సెక్రటరీ రాజకుమార్, కోచ్‌లు విద్యార్థులు తల్లిదండ్రులు అభినందనలు తెలిపారు.

రైతు బజార్‌లో సౌకర్యాల పరిశీలన

ప్రజాశక్తి- ఎంవిపి కాలనీ: నగరంలోని ఎంవిపి కాలని రైతుబజార్‌ను మార్కెటింగ్ కమిటీ చైర్మన్ ఎలమంచిలి అపర్ణప్రసాద్ మంగళవారం సందర్శించారు. రైతుబజార్‌లో రైతులు, వినియోగదారులతో ఆయన మాట్లాడారు. మార్కెటింగ్ కమిటీ వైస్‌చైర్మన్ వింకుమహంతి చంద్రశేఖరరావు, అగ్రికల్చరల్ మార్కెటింగ్ కమిటీ డైరెక్టర్లు, ఎస్టేట్‌అధికారి కె.వరహాలు, సహాయకుడు కనకరాజు, రైస్‌కౌంటర్ మురళి, ఎగ్స్ కౌంటర్ సాగర్, వాచ్‌మన్, రైతులు, వినియోగదారులు తదితరులు పాల్గొన్నారు.

మహిళలపై వివక్ష తగదు

- ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్ డాకర్ కోటిరెడి
- పలుచోట్ల స్వస్థ్ నారీ స్వశక్త్ అభియాన్ సదస్సులు


చింతూరు : సూపరింటెండెంట్ డాక్టర్ కోటిరెడ్డిని సన్మానిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి -చింతూరు: మహిళలపై వివక్ష తగదని చింతూరు ప్రభుత్వ జనరల్ హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎమ్.కోటిరెడ్డి అన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల మహిళా సాధికారత విభాగం ఆధ్వర్యంలో స్వస్థ్‌నారీ స్వశక్త్ పరివార్ అభియాన్‌పై మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. కళాశాల విద్యార్థులకు తమ హాస్పిటల్‌లో అన్ని వైద్యపరీక్షలు నిర్వహిస్తామని కోటిరెడ్డి తెలిపారు. ప్రిన్సిపల్ డాక్టర్ కె.రత్నమాణిక్యం, కళాశాల సీనియర్ అధ్యాపకులు వెంకటరావు మాట్లాడారు. అనంతరం కోటిరెడ్డిని ఘనంగా సన్మానించారు. హిందీ విభాగధిపతి కె.శైలజ వందన సమర్పణ చేశారు.

కూనవరం: మండలంలోని కూటూరు పిహెచ్‌సిలో వైద్యాధికారి డాక్టర్ శ్రీనివాసమూర్తిదొర ఆధ్వర్యంలో స్వస్థ్‌నారి స్వశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా మాజీ సర్పంచ్ సీతారామయ్య పాల్గొన్నారు. పలువురు మహిళలు, వృద్ధులు వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ఉచితంగా మందులు అందించారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్లు రాము, అర్జున్, ఎఎన్‌ఎంలు ఎంఎల్. హెచ్‌పిలు ఆశాలు పాల్గొన్నారు.



కూనవరం: వైద్యపరీక్షలు చేస్తున్న వైద్యసిబ్బంది

అనంతగిరి : స్వస్థ్‌నారీ స్వశక్త్ పరివార్ అభియాన్‌లో భాగంగా మంగళవారం టోకూరు గ్రామ సచివాలయంలో స్థానిక వైద్యాధికారి డాక్టర్ జాహ్నవి, స్థానిక సర్పంచ్ కిల్లో మొసియా ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహించారు. ఈసందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, ఇంట్లో ఇల్లాలు ఆరోగ్యంగా ఉంటే ఇంటిల్లిపాది ఆరోగ్యంగా ఉండడానికి ఆస్కారముంటుందన్నారు. డాక్టర్ జాహ్నవి మాట్లాడుతూ స్వస్థ్ నారీ స్వశక్త్ అభియాన్‌లో మహిళల ఆరోగ్యానికి ప్రాధాన్యతనిస్తూ వైద్య శిబిరాలను నిర్వహిస్తున్నామని వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. మహిళలకు హిమోగ్లోబిన్, క్షయవ్యాధి, మధుమేహం వంటి వ్యాధులకు పరీక్షలతోపాటు సర్వైకల్ క్యానర్స్‌పై అవగాహన, స్క్రీనింగ్, కౌన్సెలింగ్ నిర్వహిస్తామన్నారు. పోషక విలువలతో కూడిన ఆహారం తీసుకోవాలని సూచించారు.కార్యక్రమంలో ఎంపిహెచ్‌ఒ సింహాచలం, టిబి సూపర్వైజర్ ఎఎన్‌ఎం సంధ్య, సిబ్బంది రజని. రాము, సింహాచలం, ఆశాలు . సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి-రంపచోడవరం : అంగన్‌వాడి కేంద్రంలో అందించే పౌష్టికాహారం గర్భిణులు, పిల్లలు తప్పనిసరిగా తీసుకోవాలని సర్పంచ్ రమేష్‌బాబు, ఎంపిటిసి వంశీ కుంజం అన్నారు. ముసురుమిల్లి పంచాయతీ పరిధిలోని అంగన్‌వాడి కేంద్రంలో పౌష్టికాహార వారోత్సవాలను మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంగన్‌వాడి కేంద్రంలో పౌష్టికాహారం గర్భిణులు, పిల్లలు మాత్రమే తీసుకోవాలని సూచించారు. అనంతరం తల్లులను వారికి ప్రతినెలా అందిస్తున్న కిట్ల వివరాల గురించి అడిగి తెలుసుకున్నారు. కేంద్రంలో స్టాక్‌ను కూడా పరిశీలించారు. కార్యక్రమంలో వార్డు సభ్యురాలు సరస్వతి, మాజీ సీతపల్లి బాపన్నమ్మ, తల్లిగుడి చైర్మన్ బొబ్బా శేఖర్, అంగన్‌వాడి కార్యకర్తలు, మహిళా పోలీస్ కృష్ణవేణి, ఇంజనీరింగ్ అసిస్టెంట్ రోషిణి, ఎఎన్‌ఎం పాల్గొన్నారు.

ముంచింగిపుట్టు : పోషకాహార వారోత్సవాల్లో భాగంగా మండలంలోని జర్రెల గ్రామపంచాయతీలోని ఆరు అంగన్వాడి కేంద్రాల కార్యకర్తలు, ఆయాలతో పోషణ వారోత్సవం నిర్వహించారు. బొడ్డగొంది అంగన్వాడి కేంద్రంలో అంగన్వాడీ కార్యకర్త అంబిడి దేవకి, ఆయా మల్లీశ్వరి ఆధ్వర్యంలో, మండిబ అంగన్వాడి కేంద్రంలో కార్యకర్త బర్తంగి సరోజిని అధ్యక్షతన, డేగల పుట్టులో అంగన్వాడి కార్యకర్త తలారి శ్రీదేవి, ఆయా శాంతి, మండిబలో ఆయా భానుప్రియ, చీడిపుట్టు మినీ అంగన్వాడి కార్యకర్త మఠం అచ్చమ్మ, బాపనపుట్టులో మినీ అంగన్వాడి కార్యకర్త పాంగి లక్ష్మి ఆధ్వర్యంలో వివిధ రకాల పౌష్టికాహార వంటకాల తయారీ ప్రదర్శన నిర్వహించారు. సచివాలయ మహిళా పోలీసు సాగేన లావణ్య పాల్గొన్నారు. బొడ్డ గొందిలో గర్భిణులకు పౌష్టికాహార సూచనలు చేశారు.


ముంచింగిపుట్టులో నిర్వహిస్తున్న పౌష్టికాహార వారోత్సవాలు

పోస్టుమార్టానికి ప్రత్యేక భవనం ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి -సీలేరు: జికె వీధి మండలం సీలేరులో పోస్ట్‌మార్టం నిర్వహించడానికి ప్రత్యేక భవనాన్ని ఏర్పాటు చేయాలని అల్లూరిజిల్లా కాంగ్రెస్ డిసిసి కార్యదర్శి కారె శ్రీనివాస్ డిమాండ్ చేశారు. స్థానిక విలేకరులతో మంగళవారం మాట్లాడుతూ పోస్టుమార్టం నిర్వహించే భవనం నిర్మించకపోవడంతో 70 కిలోమీటర్ల ఉన్న చింతపల్లి ప్రభుత్వాసుపత్రికి మృతదేహాలు తరలించాల్సి వస్తోందని విచారం వ్యక్తం చేశారు. దీంతో జికె వీధి మండల పరిధి సీలేరులో ఉన్న ఆరు పంచాయతీల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్, సంబంధిత అధికారులు స్పందించి సీలేరులో పోస్టుమార్టం భవనం నిర్మించడానికి చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

నేటి నుంచి నర్సింగ్ విద్యార్థుల రాష్ట్ర సదస్సు

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ : ఎయు కన్వెన్షన్ సెంటర్ వేదికగా ది ట్రైన్డ్ నర్సస్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (టిఎన్‌ఎఐ) ఆంధ్రప్రదేశ్ ప్రాంతీయ శాఖ ఆధ్వర్యంలో 24, 25వ తేదీల్లో రెండు రోజుల పాటు నర్సింగ్ విద్యార్థుల ద్వైవార్షిక రాష్ట్ర స్థాయి కాన్ఫరెన్స్ 2025ను నిర్వహిస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ నర్సింగ్ మిడ్ వైఫ్ కౌన్సిల్ రిజిస్ట్రార్, టిఎన్‌ఎఐ రాష్ట్ర కార్యదర్శి ప్రొఫెసర్ కె.సుశీల తెలిపారు. సోమవారం రామ్‌నగర్‌లోని ఒక హోటల్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశం లో వివరాలను ఆమె వెల్లడించారు. లెర్నింగ్ టుడే, లీడింగ్ టుమారో జర్నీ ఆఫ్ నర్సింగ్ స్టూడెంట్స్ అనే అంశంపై సదస్సు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. సదస్సుకు ఎన్‌టిఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం ఉపకులపతి డాక్టర్ పి.చంద్రశేఖర్ హాజరవుతారన్నారు. టిఎన్‌ఎఐ రాష్ట్ర అధ్యక్షురాలు డాక్టర్ సి.ఆర్ శంషీర్ బేగం మాట్లాడుతూ నర్సింగ్ విద్యార్థులకు పలు పోటీలను నిర్వహిస్తామని,రాష్ట్రస్థాయి పోటీల్లో విజేతలుగా నిలచిన వారిని జాతీయస్థాయి పోటీలకు పంపుతామన్నారు. సమావేశంలో ఎగ్జిక్యూటివ్ సభ్యులు కె.ఝాన్సీలక్ష్మీభాయి తదితరులు పాల్గొన్నారు.

పనిప్రదేశాల్లో మహిళలకు భద్రత ఉండాలి

- డిఆర్‌ఎం లలిత్‌బోహ్రా

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ : పని ప్రదేశాల్లో మహిళల భద్రతకు అన్ని సంస్థలు, పరిశ్రమలు కట్టుబడి ఉండాలని ఈస్ట్‌కోస్ట్ రైల్వే వాల్తేరు డివిజన్ డిఆర్‌ఎం లలిత్‌బోహ్రా అన్నారు. మంగళవారం విశాఖపట్నంలోని పోర్ట్ సాగరమాల కన్వెన్షన్ సెంటర్లో ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ (ఎఫ్‌ఐసిసిఐ) మహిళా విభాగం ఆధ్వర్యంలో లైంగిక వేధింపుల నివారణ అంశంపై నిర్వహించిన సదస్సులో ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యా రు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మహిళలకు ప్రాధాన్యం ఇవ్వటంలో రైల్వేలు ముందున్నాయన్నారు. ఆర్పీఎఫ్ మహిళా ఉద్యోగుల భద్రతకు వారికి బాడీ ఓన్ కెమెరాలు అందించడం జరుగుతుందని, అన్ని పని ప్రదేశాల్లో లాకర్ రూమ్స్, చేంజింగ్ రూమ్స్, రెస్ట్‌రూమ్స్ వంటివి ఏర్పాట్లు చేస్తున్నామని రన్నింగ్ రూమ్స్ లో కూడా మహిళలకు ప్రత్యేక వసతులు కల్పిస్తున్నామని తెలిపారు. సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం పని ప్రాంతాల్లో మహిళలపై లైంగిక వేధింపులు తీవ్రమైన నేరమని అందుకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు. కార్యక్రమంలో వాల్తేరు డివిజన్ ఉమెన్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షురాలు జోత్స్న బోహ్రా, ఫేక్కి ఫ్లో ప్రతినిధి అంబ్రిలా అంజలివో, ప్రోగ్రాం సభ్యులు డాక్టర్ హేమ పాల్గొన్నారు.


ఆందోళన చేస్తున్న వైసిపి నాయకులు

వీధి వ్యాపారులపై కక్ష సాధింపు తగదు

- వైసిపి జిల్లా అధ్యక్షులు కెకె రాజు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : వీధి వ్యాపారులపై రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలకు పూనుకుంటోందని హాకర్ల పొట్ట కొడుతోందని వైసిపి జిల్లా అధ్యక్షులు కె.కెరాజు ఆరోపించారు. మంగళవారం జిల్లా వైసిపి ఆధ్వర్యంలో జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద నుంచి జివిఎంసి ప్రధాన కార్యాలయం వరకు శాంతియుత ర్యాలీ నిర్వహించారు. ర్యాలీని పోలీసులు అడ్డుకున్నా ర్యాలీ నిర్వహించారు. జివిఎంసి అదనపు కమిషనర్ రమణమూర్తికి వినతిపత్రం అందించారు. వైసిపి జిల్లా అధ్యక్షులు కె.కెరాజు మీడియాతో మాట్లాడుతూ, హాకర్‌జోన్లలో ఉన్న దుకాణాలనే కాకుండా హాకర్‌జోన్లు లేని చోట కూడా దుకాణాలు నిర్దాక్షిణ్యంగా తొలగించారని, దీంతో వేలాది కుటుంబాలు వీధిని పడ్డాయని చెప్పారు. బాధితులందరికీ నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. బాధితులకు న్యాయం జరిగే వరకూ వారిపక్షాన నిలబడి వైసిపి పోరాటం చేస్తుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు మళ్ల విజయప్రసాద్, తైనాల విజయకుమార్, తిప్పల గురుమూర్తిరెడ్డి, చింతలపూడి వెంకటరామయ్య, సమన్వయకర్తలు తిప్పల దేవన్‌రెడ్డి, మొల్లి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి
తెలుగు దినపత్రిక
45వ వార్షికోత్సవ ప్రత్యేక అనుబంధం
Advt. Feature
రంపచోడవరం డివిజన్ అల్లూరి సీతారామరాజు జిల్లా | బుధవారం 24-09-2025 | 8 పేజీలు

ప్రకృతి సిరి.. రంపచోడవరం

◆ సహజ సోయగాలకు పుట్టినిల్లు ◆ ఆదివాసీల బతుకులకు నిలువుటద్దం

ప్రజాశక్తి – రంపచోడవరం

ప్రకృతి సిరి, సహజ సోయగాలకు పుట్టినిల్లు రంపచోడవరం నియోజకవర్గం. పర్యాటకానికి పెట్టింది పేరు. అల్లూరి జిల్లాలోని ఈ ప్రాంతం సీజన్ ఏదైనప్పటికీ పర్యాటకులతో నిత్యం కళకళలాడుతూ ఉంటుంది. ఆదివాసీల బతుకులకు నిలువెత్తు నిదర్శనం ఈ ప్రాంతం. నియోజకవర్గంలో 11 మండలాలు ఉన్నాయి. విస్తీర్ణంరీత్యా రాష్ట్రంలో అతిపెద్ద నియోజకవర్గమని చెప్పొచ్చు. సుమారు రెండు లక్షలా 73 వేల మంది ఇక్కడ జీవిస్తున్నారు. 2022లో జిల్లాల పునర్విభజన సమయంలో తూర్పుగోదావరి జిల్లా నుంచి ఈ నియోజకవర్గం విడివడింది. ఆ ప్రక్రియలోనే విశాఖ జిల్లా నుంచి పాడేరు డివిజన్ విడిపోయింది. ఇలా విడగొట్టిన పాడేరు, రంపచోడవరం డివిజన్లను కలిపి అల్లూరి సీతారామరాజు జిల్లాను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. రంపచోడవరం నియోజకవర్గంలో చింతూరు, రంపచోడవరం ఐటిడిఎలు ఉన్నాయి. వీటిద్వారా ఆదివాసీల అభివృద్ధికి కృషి జరుగుతోంది.



మారేడుమిల్లిలోని అందాల జలతరంగిణి వాటర్‌ఫాల్స్

సహజ సిద్ధమైన అటవీ అందాలకు, జలజల పారే సెలయేళ్లకు రంపచోడవరం నియోజకవర్గం ప్రసిద్ధి. మారేడుమిల్లి, రంపచోడవరం, చింతూరు, అడ్డతీగల, రాజవొమ్మంగి మండలాలు ప్రకృతి అందాలకు నెలవు. మారేడుమిల్లిలో వ్యూపాయింట్‌లు అద్భుతంగా ఉంటాయి. తొలుత నియోజకవర్గ కేంద్రానికి సమీపంలోని రంపలో ఉన్న జలపాతం ఆకట్టుకుంటుంది. సమీపంలోనే ఉన్న భూపతిపాలెం రిజర్వాయర్ కూడా ప్రసిద్ధిచెందినదే. అలా రంపచోడవరం నుంచి పయనమై ఘాట్ రోడ్డు దాటుకొని మారేడుమిల్లి చేరుకోగానే అందాల దొంతరే కానవస్తుంది. కార్తీకవనం, పాములేరు వాగు, వనవిహారి రిసార్ట్, స్వర్ణధార, అమృతధార, జలతరంగణి జలపాతాలు వీక్షకులను కట్టిపడేస్తాయి. ఈ ప్రకృతి అందాల చుట్టూ పర్యాటక రంగం విస్తరించింది. హోటళ్లు, రిసార్టుల ఏర్పాటు, స్థానిక ఉత్పత్తుల అమ్మకాలతో వందల మందికి ఉపాధి లభించింది.

తగిన ప్రణాళికలు కరువై.. అభివృద్ధికి ఆమడదూరం

రంపచోడవరం నియోజకవర్గవాసులు పాడేరు జిల్లా కేంద్రానికి వెళ్లాలంటే వ్యయప్రయాసలు పడాల్సి వస్తోంది. ఎటపాక, కూనవరం వాసులైతే ఏకంగా 400 పైచిలుకు కిలోమీటర్లు ప్రయాణం చేయాల్సి వస్తోంది. రంపచోడవరం నియోజకవర్గ కేంద్రం నుంచి కూడా సరైన రవాణా సదుపాయాలు లేవంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవొచ్చు. ప్రభుత్వ రవాణా సౌకర్యం లేకపోవడంతో ప్రైవేటు వాహనాలను ఎక్కువమంది ఆశ్రయించాల్సిన పరిస్థితి నెలకొంది. జిల్లా అధికార యంత్రాంగాన్ని కలిసి సమస్య చెప్పుకుందామన్నా, వినతిపత్రం ఇద్దామన్నా రెండు రోజులు పడుతోందని పలువురు చెబుతున్నారు. రంపచోడవరానికి ఆర్‌టిసి డిపో లేకపోవడంతో రాజమండ్రి, గోకవరం, కాకినాడ ప్రాంతాల నుంచి సర్వీసులు (మిగతా 5లో..)





సమిష్టితత్వానికి తార్కాణం ..

ఆదివాసీల భూమి పండుగ

ప్రజాశక్తి-చింతూరు : అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు డివిజన్ ఏజెన్సీ ప్రాంతంలో ప్రతి సంవత్సరం స్థానిక ఆదివాసీ గిరిజనులు వారి మొదటి పండుగ అయిన భూమి పండుగను సమిష్టిగా సందడిగా చేసుకుంటారు. చిన్నా పెద్దా ఊరంతా కలిసి భూమి పండుగను సంతోషంగా చేసుకుంటారు. ప్రతి ఏటా తొలకరి ప్రారంభంలో ప్రకృతి పచ్చదనంతో నిండిన సమయంలో ఆదివాసీలు ఊరి జనమంతా సమావేశం అవుతారు. భూమి పండుగ ఎప్పుడు చేయాలో గ్రామపెద్దలతో పూజారి పటేల్‌లతో చర్చించి నిర్ణయిస్తారు.

ఈ పండుగతోనే ఆదివాసీల పండుగలు అన్నీ ప్రారంభం అవుతాయి. భూమి పండుగ చేయకుండా ఆదివాసీలు మిగతా ఏ పండుగలనూ నిర్వహించరు. తమ కులదైవాలకు సంబంధించిన పండగలు కూడా ఈ భూమిపండగ తర్వాతనే. ఈ పండుగ ప్రత్యేకత ఏమిటంటే గ్రామంలో ఉన్న పురుషులంతా విల్లంబులు చేతపట్టుకుని సమీప అడవుల్లో వేటకై వెళతారు. వేటకు వెళ్లే యువకులకు మహిళలు ఎదురెళ్లి తిలకాలు దిద్ది క్షేమంగా వెళ్లి వేటతో రావాలని కోరుతూ ఆదివాసీ గీతాలను ఆలపిస్తారు. మగవారు అడవికి వెళ్ళిన అనంతరం గ్రామంలో ఉన్న మహిళలంతా కలిసి సమిష్టిగా రహదారులపై అడ్డంగా కర్రలు, గొలుసులు పట్టుకుని సామూహిక నృత్యం చేస్తూ వాహనాలను ఆపుతూ రేలా పాటలు పాడుతూ భూమి పండుగ చందాలను సేకరిస్తారు. అలా సేకరించిగా వచ్చిన డబ్బును గ్రామంలో ఉత్సవాల్లో ఖర్చు చేసి సంతోషంగా పండుగ నిర్వహిస్తారు. వేటాడి తెచ్చిన జంతువులను గ్రామంలో అందరూ కలిసి వాటాలు వేసుకొని సమానంగా పంచుకుంటారు. ఆదివాసీల పండుగలు అడవిలో వేట ఒక ముఖ్య ఘట్టం. ఆదిమ కాలం నుండి తమ పూర్వీకులు ఆచరిస్తున్న భూమి పండుగను మరువకుండా వారి భావితరాలకు అందించే క్రమంలో ప్రతి సంవత్సరం జూన్ మొదటి వారంలో పండుగను ప్రారంభిస్తారు. ఒక్కో గ్రామంలో ఒక్కో రోజు భూమిపండుగ కార్యక్రమాన్ని నిర్వహిస్తుంటారు.

కోడిగుడ్డును బాణంతో కొట్టడంతో ప్రారంభం

భూమిపండుగ ప్రారంభానికి ముందు గ్రామంలో మహిళలు కోడుగుడ్డుకి కుంకం తిలకం దిద్ది ఒక ప్రదేశంలో పెట్టి వేటకు వెళ్లే విల్లంబులను ఎక్కుపెట్టి గురి చూసి గుడ్డును కొడతారు. అలా చేస్తే గురి తప్పకుండా మగవారు అడవికి వెళ్లి కచ్చితంగా జంతువులు వేటాడి తీసుకువస్తారని ఒక నమ్మకం. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు పటేల్ పూజారి గ్రామస్తులు పాల్గొంటారు.

వేటలో వేటకుక్కల ప్రాధాన్యం

అడవిలో వేటకు వెళ్లిన వేటగాళ్లకు జంతువు ఏదైనా కనపడినప్పుడు అది అడవిలోకి పారిపోకుండా తమ వెంట తెచ్చుకున్న పెంపుడు కుక్కలను ఉసిగొలుపుతారు. వెంటనే అవి జంతువును చుట్టుముట్టి ఎటూ వెళ్లకుండా కట్టడి చేస్తాయి. ఇది అదునుగా చూసుకుని వేటగాళ్ల నాలుగు దిక్కులా చేరుకొని విల్లంబులు ఎక్కుపెట్టి జంతువును వేటాడతారు. వారు పెంచుకున్న పెంపుడు కుక్కలు కూడా వేటగాళ్లకు సహకరిస్తూ వేట విజయవంతంగా జరగడానికి సహకరిస్తుంటాయి.

సమిష్టి తత్వానికి నిదర్శనం

ఆదివాసీలు గ్రామంలో రచ్చబండ వద్ద సమావేశమై పండుగ ఎప్పుడు ప్రారంభించాలి. వేటకు ఎప్పుడు వెళ్లాలి కార్యక్రమాలు ఏ విధంగా ప్రారంభించాలి అనే చర్చను గ్రామపూజారి పటేల్ గ్రామపెద్దల సమక్షంలో చర్చలు నిర్వహిస్తారు. అనంతరం ఒక రోజును నిర్ణయించి ఆ రోజు నుండి గ్రామంలో మూడు రోజులపాటు వేట వంటి కార్యక్రమాలు నిర్ణయించబడతాయి.

రేలా పాటలు, డోలుకొమ్ములతో ఆటపాటలు

భూమి పండుగ చివరి రోజు గ్రామంలో ఆదివాసీ స్త్రీ పురుషులు కలిసి రేలా పాటలు పాడుతూ పురుషులు డోలు కొమ్ములతో పండుగ సందడి చేస్తారు. మహిళలు ఒకరినొకరు భుజాలపై చేతులు వేసి లయబద్ధంగా అడుగులు వేస్తూ వృత్తాకారంలో తిరుగుతూ పాటలు పాడుతూ కనువిందు చేస్తారు. పాటల్లో హాస్యం, కవ్వింపు, పొగడ్తలు, వెటకారం, మమకారం, వేళాకోళం, ఆటపట్టింపు వంటి పదాలతో పాటలు పాడుతారు.

అడవిదున్న కొమ్ములే ఆదివాసీ కళాకారుల కిరీటాలు

అడవిలో వేటాడి అడవి దున్నల కొమ్ములను నరికి రంగురంగుల వస్త్రాలతో తలపాగాల చుట్టి కొమ్ములను వాడిగా చేసి వాటిపై నెమలి పింఛాలను అలంకరించి ఒక పొడవైన వస్త్రాన్ని వెనుక భాగంలో కాళ్ల వరకు వేలాడేలా తలపాగాను చుట్టి ఆదివాసీ కళ కారుల తలపాగాను తయారు చేస్తారు. నేలపై ఉన్న చిన్న వస్తువును తను ధరించిన అడవి దున్న కొమ్ములతో తీసేందుకు ఒకరినొకరు పోటీపడుతూ తలపడతారు. కొందరు రూపాయి నోట్లను నేలపై వేసి తలకు ధరించిన అడవి దున్న కొమ్ములతో వాటిని తీయాలని ప్రయత్నిస్తుంటారు. ఈ క్రమంలో కొద్దిగా అదుపు తప్పితే మాత్రం ఎదుట వారి శరీరంలో తలపాగా కొమ్మర్చిన అడవి దున్న వాడి అయిన కొమ్ములు దూసుకుపోతాయి. అలా జరగకుండా జాగ్రత్త పడుతూ రేల పాటలు కనుగుణంగా డోలు వాయిస్తూ నృత్య భంగిమలను ప్రదర్శిస్తుంటారు.

ఏజెన్సీ ఎండు ఖర్జూరం ఈత పళ్లు





ప్రజాశక్తి - చింతూరు : ఏజెన్సీ గిరిజన అటవీ ప్రాంతంలో అత్యధికంగా ప్రకృతి సిద్ధంగా పుష్కలంగా ఈతపళ్లు దొరుకుతుంటాయి. ఆదివాసీలు ఈ సీజన్లో ఈత పళ్లు సేకరించి మంచి ఆదాయం పొందుతున్నారు. ప్రతిరోజు చుట్టుపక్కల గిరిజన గ్రామాల నుండి మహిళలు ఈత పళ్లు సేకరించి మండల కేంద్రానికి బుట్టల్లో తీసుకువచ్చి చిన్న స్టీల్‌గ్లాస్ రూ.20 చొప్పున విక్రయిస్తున్నారు. ప్రయాణికులను అత్యధికంగా ఆకర్షించి నోరూరించేలా ఈత పళ్ళు కనిపిస్తూ వినియోగదారులను కొనేలా చేస్తున్నాయి. ఈతపళ్ళలో ఎటువంటి హాని కలిగించే రసాయనాలు కానీ కత్రిమ చర్యలు కానీ లేకపోవడంతో మానవాళికి ఎంతో ఆరోగ్యదాయనిగా ఈ పళ్ళు తరాలుగా లభిస్తున్నాయి. మండలంలోని ప్రధానంగా అల్లిగూడెం, టాపర్‌పేట, రతనాపురం, కొత్తూరు గ్రామాల్లో మహిళలు అడవిలో ఉన్న ఈత చెట్ల వద్దకు వెళ్లి ఈతపళ్లు సేకరిస్తారు. ప్రతిరోజు 300 నుండి 500 రూపాయల వరకు పళ్లు విక్రయించడం ద్వారా వీరు ఆదాయాన్ని పొందుతారు.

ఈత పళ్లు ఆరోగ్యానికి ఎంతో మేలు

ప్రకృతి ప్రసాదించిన పళ్లలో ఈత పళ్లు కూడా ఆరోగ్యానికి ఎంతో మంచింది. స్త్రీలు ఈతపళ్లు తింటే రక్తహీనత తో పాటుగా తరచూ వచ్చే రుతుక్రమ సమస్యలు కూడా తగ్గుతాయి. మధుమేహ వ్యాధిగ్రస్తులు కూడా ఈ పళ్లు తినొచ్చని పిల్లలు కూడా ఈ పళ్ళను తినటం వలన పౌష్టిక విలువలు చేకూరుతాయని పలువురి నమ్మకం.

విప్లవ వీరుడు అల్లూరి

ప్రజాశక్తి-రాజవొమ్మంగి: అల్లూరి సీతారామ రాజు వ్యక్తిత్వం బహుముఖమైనది. మహోన్నతమైనది. మిక్కిలి విశిష్టమైనది. ఆయన భారతీయత సంస్కృతి సంప్రదాయాలకు నిలువెత్తు రూపం. ఆయనలో భారతీయుడు, సంఘసంస్కర్త, న్యాయమూర్తి ఉన్నాడు. వెరసి విప్లవ వీరుడయ్యాడు. ఆయన అత్యంత చిన్న వయసులోనే స్వరాజ్య సాధనకు సర్వసంగ పరిత్యాగం చేసిన విరాగి. సౌకర్యాలు కోరని ఆదర్శమూర్తి. దీనజనుల సేవ చేయడానికి వివాహాన్ని కూడా త్యజించిన మహనీయుడు. అందుకే మన్యం ప్రజలకు ఆయనమాట వేద వాక్కు. వారంతా ఆయన అడుగుజాడల్లో నడిచారు. ఆయన బ్రిటీష్ పాలకులకు, భూస్వాములకు, ముఠాదారులకు, వడ్డీ వ్యాపారులకు, దోపిడీదారులకు సింహ స్వప్నం. బ్రిటిష్ పాలకుల పాలనను తీవ్రంగా వ్యతిరేకించారు.



మన్యం ప్రజలను ఒక్క తాటిపై నడిపిన వీరుడు సీతారామరాజు. మన్యం ప్రజలను బ్రిటిష్ పాలకులు చిత్రహింసలకు గురి చేయడం, మన్యవాసులు మానప్రాణాలను హరించడం వంటి ఘటనలను అల్లూరి సీతారామరాజు సహించలేక తిరుగుబాటు చేపట్టారు. సీతారామరాజు 1887 జులై 4న విశాఖ జిల్లా పాండ్రంగిలో జన్మించారు. సీతారామరాజు తల్లిదండ్రులు సూర్యనారాయణమ్మ, వెంకటపతిరాజు. మన్యవాసులు ఆరాధ్యుడైన అల్లూరి 1922 ఆగస్టు 22 నుంచి 1924 జులై 16వ తేదీ వరకు మన్యంలో అలుపెరగని పోరాటం చేశారు. 1922 సంవత్సరంలో రామరాజు మన్యం ప్రజలను విప్లవానికి సిద్ధం చేశారు. విప్లవ దళాలతో వివిధ పోలీస్ స్టేషన్లపై రామరాజు దాడులు చేయించారు. విశాఖ జిల్లాలో 1922 ఆగస్టు 22న మన్యంలో తిరుగుబాటు ప్రారంభమైంది. చింతపల్లి పోలీస్ స్టేషన్‌పై 300 మంది విప్లవకారులతో రామరాజు దాడిచేసి, అక్కడి రికార్డులను చింపివేశారు. మందుగుండు సామాగ్రి, తుపాకులను ఆయనతో తీసుకెళ్తున్నట్లు వివరాలను రిజిస్టర్‌లో రాశారు. 1924 ఆగస్టు 23న కృష్ణదేవిపేట పోలీస్‌స్టేషన్‌పై దాడి చేసి తుపాకులను, మందు గుండు సామాగ్రిని తీసుకెళ్లారు. 1924 ఆగస్టు 24న రాజవొమ్మంగి పోలీస్‌స్టేషన్‌పై దాడిచేసి తుపాకులను స్వాధీనం చేసుకోవడంతో పాటు పోలీస్ స్టేషన్‌లో బందీగా ఉన్న ముట్టడం వీరయ్య దొరను విడిపించి తీసుకెళ్లారు. అక్టోబర్ 15న అడ్డతీగల, అక్టోబర్ 19న రంపచోడవరం పోలీస్ స్టేషన్లను పట్టపగలే ముట్టడించారు. సీతారామరాజు బ్రిటిష్ సైనికులను ముప్పు తిప్పలు పెట్టి తెలుగు వాడి పౌరుషాన్ని ప్రపంచానికి చాటారు. బ్రిటిష్ పాలకులకు కంటి మీద కునుకు లేకుండా చేశారు. గిరిజనులను ఐక్యం చేసి వీరయ్యదొర, కంకిపాడు, గాం గట్టందొర, మల్లుదొర, ఎండు పడాల్, ముక్కుడు శంకోజీ, వేగిరాజు సత్యనారాయణరాజు, గోకిరి ఎర్రేసు, మోదిగాడు, లాగరాయి పితురి వీరుడు వీరయ్యదొరల వంటి సుమారు 200 మంది సాహస వీరులతో అలుపెరగని పోరాటం చేశారు. సీతారామరాజు గిరిజనులకు కొండపోడు భూములపై హక్కు ఉండాలని, అటవీ ఉత్పత్తులు సేకరించుకుంటారని, శిస్తు కట్టరని చెప్పేవారు. సీతారామరాజు సారథ్యంలో మన్యం తిరుగుబాటు ఎంతగానో విజయవంతమైంది.

ఏజెన్సీ వాసుల కోసం 1924 మే 7న ఆయన వీర మరణం పొందారు. అల్లూరి నడియాడిన, ఎంతో చరిత్ర కలిగిన మన్యం ప్రాంతాన్ని పాలకులు అభివృద్ధి చేయాలని ఏజెన్సీ ప్రాంత వాసులు కోరుతున్నారు.



అందరికీ అందుబాటులో భద్రాచలం

ప్రజాశక్తి -ఎటపాక :

దక్షిణ భారతదేశ అయోధ్యగా పేరుగాంచిన ప్రసిద్ధ పుణ్యక్షేత్రం భద్రాచలం. రాష్ట్ర విభజన తర్వాత భద్రాచలం మండలంలోని భద్రాచలం పట్టణం మినహా మిగతా గ్రామాలను ఎటపాక కేంద్రంగా ప్రత్యేక మండలంగా ఏర్పాటుచేశారు. భద్రాచలానికి రెండు దిక్కులా గోదావరి సరిహద్దు అయితే మరో రెండు వైపులా ఎటపాక మండలం సరిహద్దు. మండలం ముక్కలైనా మండల ప్రజలు మాత్రం తెల్లారితే భద్రాచలంపైనే ఆధారపడి జీవిస్తున్నారు. ఎటపాక ఒక్క మండలమే కాదు చింతూరు, విఆర్.పురం, కూనవరం మండల ప్రజలకు కూడా ఆయువుగా భద్రాచలం ఉంది. నిత్యం కూరగాయలు, నిత్యావసర సరుకులు, గృహోపకరణాలు, దుస్తులు, నగలు, విద్య, వైద్యం, వ్యవసాయ అవసరాలు, వ్యాపారం తదితరాలన్నింటికి భద్రాచలం వెళ్లాల్సిందే. భద్రాచలంతో ముంపు ప్రజల అనుబంధం అంతగా పెనువేసుకు పోయింది. భద్రాచలంతో అనుబంధం రాష్ట్రాల విభజనతో సంబంధం లేనిది. ఈ నాలుగు మండలాల ప్రజల కొనుగోలుతోనే భద్రాచలం వ్యాపారాలు సాగుతున్నాయనడంలో అతిశయోక్తి లేదు. భద్రాచలం చుట్టూ వరద నీరు చేరితే భద్రాచలంలోని వ్యాపార సముదాయాలన్నీ నిర్మానుష్యంగా మారుతాయి. ఈ ఒక్క ఉదాహరణ చాలు నాలుగు మండలాల కొనుగోలుతో భద్రాచలంలో వ్యాపారం ఏ విధంగా సాగుతుందో తెలుస్తోంది. గత రెండేళ్ల నుంచి 4 ముంపు మండలాల్లో వ్యవసాయం నష్టాల బాటలో, అప్పుల ఊబిలో కూరుకుంది. దీంతో ప్రజల కొనుగోలు శక్తి పడిపోయింది. ఈ ప్రభావం భద్రాచలం వ్యాపారంపై పడింది. నిత్యావసరాలు మినహా గృహోపకరణాలు, నగలు, దుస్తుల, వాహనాల కొనుగోలు భారీగా తగ్గింది.



వైద్యానికి భద్రాచలమే దిక్కు

నాలుగు మండలాల ప్రజల వైద్యానికి భద్రాచలం పెద్ద దిక్కుగా ఉంది. పేద, గిరిజనులకు భద్రాచలం ఏరియా ఆసుపత్రిలోనే వైద్యం పొందుతున్నారు. నాలుగు మండలాల్లో అత్యధిక శాతం గర్భిణులకు కాన్పులు చేసేది భద్రాచలం ఆసుపత్రులే. కూనవరం, చింతూరు సిహెచ్‌సి లో చేయలేని వైద్యానికి కూడా భద్రాచలం హాస్పిటలే దిక్కుగా ఉంది. భద్రాచలం ఏరియా ఆసుపత్రితో పాటు పదుల సంఖ్యలో ఉన్న ప్రైవేట్ హాస్పిటల్స్ కూడా నాలుగు మండలాల ప్రజలకు వైద్య సేవలు అందిస్తున్నాయి. ఈ నాలుగు మండలాల్లో ఎక్కడ యాక్సిడెంట్ అయినా క్షతగాత్రులను, మృతదేహాలను భద్రాచలం ఏరియా ఆసుపత్రికే తరలిస్తారు.

భద్రాచలం పట్టణానికి సరిహద్దులుగా ఉన్న ఐదు పంచాయతీలు ఎటపాక, కన్నాయిగూడెం, పిచ్చుకలపాడు, గుండాల, పురుషోత్తమపట్నాన్ని భద్రాచలంలో కలపాలంటూ రాష్ట్ర విభజన సమయం నుంచే ఆయా పంచాయతీల ప్రజలు ప్రభుత్వాల ముందు ఒక డిమాండ్ ఉంచారు. ఈ గ్రామాల ప్రజల డిమాండ్‌కు మద్దతుగా భద్రాచలం పట్టణ ప్రముఖులు, రాజకీయ పార్టీలు కూడా సంఘీభావం ప్రకటించాయి. ఎటపాక జటాయువు, ఉష్ట గుండాల, పురుషోత్తమపట్నం రాములోరి భూములు, సరిహద్దు రవాణాకు అనుకూలంగా కన్నాయిగూడెం, పిచ్చుకలపాడు గ్రామ పంచాయతీలు కలపాలనేది ఒక వాదన. ఎటపాక మండలం మొత్తం తెలంగాణలో కలపాలని మరొక వాదన, కాదు విలీన మండలాలను కూడా తెలంగాణలో కలపాలనే వాదన కూడా ఉంది. ఈ వాదనలకు కారణం ప్రభుత్వాల మీద వ్యతిరేకం కాదు అనునిత్యం భద్రాచలంపై ఆధారపడటమే కారణం.

వరద సమాచారం అక్కడి నుంచే...

వర్షాకాలం వచ్చిందంటే ముంపు మండలాల ప్రజలు బిక్కు బిక్కుమంటూ గడపాల్సి వస్తోంది. వరద సమాచారం కూడా భద్రాచలం వద్ద గోదావరి ప్రవాహాన్ని బట్టే ముంపు ప్రాంతాల ప్రజలు ఒక అంచనాకు వస్తుంటారు. ముంపు మండలాల పర్యటనకు వచ్చే అధికారులు, ప్రజా ప్రతినిధులు కూడా భద్రాచలంలో రాములోరిని దర్శించుకోవాల్సిందే. ఇలా ప్రతి విషయంలో ప్రతి ఒక్కరికీ భద్రాచలంతో అనుబంధం ఏర్పడింది.









ప్రకృతి అందాలకు నెలవు ... పాపికొండలు

ప్రజాశక్తి - విఆర్‌పురం: పాపికొండలు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో, తూర్పు కనుమలలో ఉన్న ఒక అందమైన పర్వత శ్రేణి. రెండు కొండల మధ్య నుంచి ఈ ప్రదేశాన్ని చూసేందుకు వెళ్లాలి. రెండు కొండల మధ్య పాపిటలాంటి ఇరుకైన ప్రదేశం ఉంటుంది. అందుకే దీనిని పాపిట కొండలు అంటారు. కాలక్రమేణా ఇది పాపికొండలుగా మారింది. ఇది గోదావరి నది ఒడ్డున ఉంది.పాపికొండలకి వెళ్లడానికి రాజమండ్రి, భద్రాచలం వంటి ప్రాంతాల నుండి పడవల్లో ప్రయాణించాలి. ఇది ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని అల్లూరి సీతారామ రాజు, ఏలూరు జిల్లాలతో పాటు తెలంగాణ వరకు విస్తరించి ఉంది. వనవాస సమయంలో రాముడు, సీత ఈ ప్రాంతాన్ని సందర్శించారని పలువురు నమ్ముతారు.



ప్రకృతి రమణీయతకు మారుపేరైన పాపికొండల అందాలు

ప్రత్యేకతలు

జీవవైవిధ్యం: ఈ ప్రాంతం అధిక స్థాయిలో జీవవైవిధ్యం కలిగి ఉంది, అనేక రకాల మొక్కలు, జంతుజాలం ఇక్కడ కనిపిస్తాయి. ప్రకృతి సౌందర్యం, కొండలు, పచ్చదనం, జలపాతాలు, ప్రశాంతమైన వాతావరణంతో ఆహ్లాదకరంగా ఉంటుంది.

జాతీయ ఉద్యానవనం: ఇది ఒక జాతీయ ఉద్యానవనంగా గుర్తించబడింది.



పాపికొండల విహారయాత్రలకు సిద్ధంగా ఉన్న బోట్లు

ఎలా వెళ్లాలి:

పాపికొండలకు ప్రధానంగా గోదావరి నది ద్వారా పడవ ప్రయాణం చేస్తారు. రాజమండ్రి నుండి పడవలో వెళ్లవచ్చు.

తెలంగాణలోని భద్రాచలం నుండి కూడా పడవ ప్రయాణం అందుబాటులో ఉంటుంది.

పర్యటనకు ఉత్తమ సమయం

పాపికొండలను సందర్శించడానికి శీతాకాలం (నవంబర్ నుండి ఫిబ్రవరి వరకు) అనువైనది. ఈ సమయంలో వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది.

పున్నమి టూరిజం

పాపికొండలు టూర్ ప్యాకేజీ రాజమండ్రి, పట్టిసం (రాజమండ్రి నుండి 35 కి.మీ), పోలవరం (రాజమండ్రి నుండి 40 కి.మీ), కూనవరం (భద్రాచలం నుండి 50 కి.మీ) లేదా శ్రీరామగిరి (భద్రాచలం నుండి 60 కి.మీ) పాపికొండలు పశ్చిమ గోదావరి జిల్లా, ఆంధ్రప్రదేశ్ లోని రాజమహేంద్రవరం నగరానికి సుమారు 60 కిలోమీటర్ల దూరంలో, తెలంగాణ లోని భద్రాచలం పట్టణం నుండి సుమారు 60 కిలోమీటర్ల దూరంలో ఉంది పాపికొండలు..

పర్యాటక స్వర్గధామం..రంపచోడవరం



తాళ్లపాలెంలో పుష్ప సినిమా షూటింగ్ స్పాట్

ప్రజాశక్తి - రంపచోడవరం: అల్లూరి సీతారామరాజు జిల్లా రంపచోడవరం మండలం ప్రకృతి సౌందర్యాలతో పర్యాటకులను ఆకట్టుకుంటోంది. ఎత్తయిన కొండలు, జలపాతాలు, పచ్చని అరణ్యాలు, చారిత్రక దేవాలయాలు ఈ ప్రాంతానికి ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. వారాంతాలు, సెలవుదినాల్లో కుటుంబ సభ్యులు, బంధుమిత్రులతో కలిసి వందలాది మంది సందర్శకులు ఇక్కడికి చేరుకుని ఉల్లాసంగా గడుపుతుంటారు. ముఖ్యంగా ఐ. పోలవరం పార్క్, భూపతిపాలెం రిజర్వాయర్, రంప జలపాతం, పుష్ప సినిమా షూటింగ్ స్పాట్ వద్ద పర్యాటకుల రద్దీ అధికంగా కనిపిస్తోంది.

రంప జలపాతం

రంపచోడవరం నుంచి మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న ఈ జలపాతానికి ప్రతిరోజూ వందలాది మంది సందర్శకులు వస్తుంటారు. ఎత్తైన కొండలపై నుంచి జాలువారే నీరు, పచ్చని చెట్లు సుందర దశ్యాన్ని మంత్రముగ్ధుల్ని చేస్తాయి. సమీపంలో ఉన్న 14వ శతాబ్దానికి చెందిన భ్రమరాంబిక మల్లికార్జున స్వామి ఆలయం ప్రత్యేక ఆకర్షణ. కార్తీకమాసంలో భక్తులు జలపాతంలో స్నానాలు ఆచరించి, ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించడం సాంప్రదాయంగా కొనసాగుతోంది.

భూపతిపాలెం రిజర్వాయర్

ఒక వైపు ఎత్తైన పర్వతాలు, మరోవైపు నీటి నిల్వలతో అందమైన దశ్యాన్ని అందించే ఈ రిజర్వాయర్ ఫోటో షూట్లకు ప్రాధాన్యం పొంది ంది. కొండల మధ్య వంకరగా తిరుగుతున్న రహదారి పర్యాటకులను ఆకర్షిస్తోంది.

ఐ. పోలవరం పార్క్

మండల కేంద్రానికి ఆరు కిలోమీటర్ల దూరంలో ఉన్న ఈ పార్క్ పర్యాటకుల వినోదానికి ప్రాధాన్య కేంద్రంగా మారింది. చిన్నారుల కోసం ఏర్పాటు చేసిన ఆట వస్తువులు వారిని ఆనందపరుస్తుండగా, సమీపంలోని వాగులో స్నానాలు చేసేందుకు సందర్శకులు ఆసక్తి చూపుతున్నారు. అలాగే, పార్క్ సమీపంలోని టిటిడి దత్తత వెంకటేశ్వర స్వామి ఆలయం భక్తులను ఆకర్షిస్తోంది.



రంప జలపాతంతో పర్యాటకుల జలకాలాటలు

పుష్ప వన్ షూటింగ్ స్పాట్

తాళ్లపాలెం సమీపంలో అల్లు అర్జున్ హీరోగా నటించిన పుష్ప చిత్రంలోని ముఖ్య భాగాలు చిత్రీకరించిన ఈ ప్రదేశం సందర్శకులను విపరీతంగా ఆకర్షిస్తోంది. అభిమానులు, పర్యాటకులు ఇక్కడకు అధిక సంఖ్యలో చేరుకుంటున్నారు. ప్రకతి సౌందర్యం, ఆధ్యాత్మికత భావన, వెరశి రంపచోడవరం పర్యాటకుల స్వర్గధామంగా తలపిస్తోందని స్థానికులు గర్వంగా చెబుతున్నారు.

వారి జీవితం ప్రజలకే అంకితం

చట్టసభల్లో ఆదివాసీల గొంతు వినిపించిన కుంజా బొజ్జి, సున్నం రాజయ్య ఆదర్శ ప్రజాప్రతినిధులుగా అందరికీ స్ఫూర్తి

ప్రజాశక్తి - అల్లూరి డెస్క్

వారి జీవితం ప్రజలకే అంకితం. వారి గళం.. ఆదివాసీల స్వరం. చట్టసభల్లో గిరిజనుల వెతలను కళ్లముందుంచి సమస్యల పరిష్కారానికి వారు చేసిన కృషి చిరస్మరణీయం. సామాన్యులుగా ఉంటూ.. పోరాట తెగువతో అసామాన్య విజయాలు సాధించిన వారే కుంజా బొజ్జి, సున్నం రాజయ్య. వీరు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని భద్రాచలం కేంద్రంగా ఎర్రజెండాను రెపరెపలాడించారు. వారి పోరాట గురుతులను నేటికీ ఆదివాసీలు గుర్తుచేసుకుంటూ ఉత్తేజం పొందుతారు.



కుంజా బొజ్జి



సున్నం రాజయ్య

ఏజెన్సీ సుందరయ్య కుంజా బొజ్జి

కుంజా బొజ్జికి ఏజెన్సీ సుందరయ్యగా పేరు. మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలిచినప్పటికీ సాధారణ జీవితం గడపడం ఆయన సొంతం. ఎర్రజెండా అంటే చిన్ననాటి నుంచి ఎంతో మక్కువ. ప్రాణం కంటే నమ్మిన సిద్ధాంతానికి ప్రాధాన్యత ఇవ్వడంలో ఆయనకు ఆయనే సాటి. నాడు సిపిఎంకు రాజీనామా చేయాలని మావోయిస్టులు తుపాకులతో బెదిరిస్తే ప్రాణమైనా తీసుకుంటారుగానీ పార్టీకి రాజీనామా చేయనని ఎదురొడ్డిన ధైర్యశాలి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని వర రామచంద్రపురం మండలంలోని అడవి వెంకన్నగూడెం గ్రామంలో కుంజా జోగయ్య -లచ్చమ్మ దంపతులకు 1926 ఫిబ్రవరి 10న ఆరో సంతానంగా బొజ్జి జన్మించారు. 1948లో లాలమ్మతో వివాహం జరిగింది. భద్రాచలం ఏజెన్సీలో సిపిఎం విస్తరణకు కృషి చేశారు. భద్రాచలం అసెంబ్లీ నియోజకవర్గం నుంచి 1985లో సిపిఎం అభ్యర్థిగా గెలిచారు. నిరుపేద గిరిజన, గిరిజనేతరుల సమస్యల పరిష్కారం కోసం, కార్మికుల కూలీ పెంపు కోసం ప్రజా ఉద్యమాలు నిర్వహించారు. సిపిఎం నేత సుందరయ్యను ఆదర్శంగా తీసుకుని బొజ్జి పార్టీలో క్రియాశీలకంగా వ్యవహరించేవారు. అదేవిధంగా 1989, 1994లోనూ సిపిఎం తరపున పోటీ చేసి హ్యాట్రిక్ విజయం సాధించారు. కనీసం బస్సు సౌకర్యం లేని గ్రామం నుంచి వచ్చిన బొజ్జి కాలినడకనే పార్టీ కార్యక్రమాల్లో పాల్గొనేవారు. ప్రజల్లో మంచి పేరు గడించారు. ఎమ్మెల్యేగా ఉన్నప్పటికీ సైకిల్‌పైనే కార్యాలయానికి వెళ్లేవారు. సైకిల్‌పైనే తిరుగుతూ ఉండేవారు. బొజ్జికి ఆరుగురు సంతానం కాగా, ముగ్గురు కుమారులు, ముగ్గురు కుమార్తెలు, వారంతా పూరి గుడెసెలోనే జీవించేవారు. బతికున్నంత కాలం ఆదివాసీల పక్షాన నిలిచిన బొజ్జి 2021 ఏప్రిల్ 12న కన్నుమూశారు.

అందరివాడు.. రాజయ్య

భద్రాచలం శాసనసభ్యునిగా మూడుసార్లు పనిచేసి అందరి మన్ననలు పొందిన ఆదివాసీ ముద్దు బిడ్డ సున్నం రాజయ్య కోవిడ్‌తో 2020 ఆగస్టు 3వ తేదీ రాత్రి కన్నుమూశారు. భద్రాచలం నియోజకవర్గం అభివృద్ధిలో ఆయనది ప్రత్యేక ముద్ర. మూడుసార్లు ఎమ్మెల్యేగా పనిచేసినప్పటికీ రాజయ్య నిరాడంబరంగా, సామాన్య జీవితం గడుపుతూ అందరికీ ఆదర్శంగా నిలిచారు. సిపిఎం పోరాటాలు, ఉద్యమాలలో తనదైన శైలిలో పనిచేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని విఆర్.పురం మండలం సున్నంవారి గూడెంలో 1958 ఆగస్టు 8న కన్నమ్మ, రాజు దంపతులకు రాజయ్య జన్మించారు. పదో తరగతి వరకు చదువుకున్న రాజయ్యకు చుక్కమ్మతో వివాహమైంది. రాజయ్య 1979లో సిపిఎం సభ్యత్వం తీసుకున్నారు. విఆర్.పురం మండలంలోని చిన్నమట్టపల్లి సర్పంచ్‌గా 1988లో విజయం సాధించారు. డివైఎఫ్ఐ భద్రాచలం డివిజన్ కార్యదర్శిగానూ, అధ్యక్షునిగానూ పనిచేశారు. ఏజెన్సీలో యువతను మార్క్సిస్టు పార్టీ వైపు నడిపించడానికి మన్యంలో విల్లంబుల పోటీ, గ్రామీణ క్రీడలైన కబడ్డీ తదితర పోటీలు నిర్వహించి యువతలో సిపిఎం పట్ల అంకితభావం పెరిగేలా కృషి చేశారు. తనకున్న 15 ఎకరాల వ్యవసాయ భూమిని సైతం గిరిజన చిన్నారుల చదువుకోసం ఆశ్రమ పాఠశాల నిర్మాణానికి ఐదెకరాలు, కాలనీ నిర్మాణానికి మరో ఐదెకరాలు, ఊరికి చెరువు కావాల్సి వచ్చినప్పుడు మరో ఐదెకరాలు రాసిచ్చారు. ఇలా సర్వస్వం తమ తమ ప్రాంత ప్రజల ప్రయోజనాలకు దానం చేసిన ఉదారవాది రాజయ్య.

భద్రాచలం శాసనసభ్యునిగా రాజయ్య మూడుసార్లు గెలుపొందారు. 1999లో తొలిసారి, ఆ తరువాత 2004, 2014లో ఎమ్మెల్యేగా విజయం సాధించారు. 2009లో భద్రాచలం నుంచి, 2019లో ప్రస్తుత ఆంధ్రప్రదేశ్‌లోని రంపచోడవరం అసెంబ్లీ నియోజకవర్గం నుంచి పోటీ చేసి ఓటమి చెందారు. ఆయన భద్రాచలం ఎమ్మెల్యేగా పనిచేసిన సమయంలో బస్సులు, ఆటోల్లో సామాన్యునిలా ప్రయాణించేవారు. నిదానం ఇంటిపేరు, నిలకడ అసలు పేరుగా అనునిత్యం ప్రజల సమస్యలపై పోరాటంచేస్తూ అందరివాడుగా ఉండేవారు. భూ పోరాటాలు, తునికాకు పోరాటాలు, పోలవరం నిర్వాసితుల కోసం మహాపాదయాత్ర, తదితర పోరాటాల్లో రాజయ్య చురుగ్గా పాల్గొన్నారు.

ఐటిడిఎ పాలకమండలిలోనూ, శాసనసభలోనూ అనేక సందర్భాల్లో కోయభాషలోనే మాట్లాడేవారు. ఉద్యమాల కాలంలో 1985లో అమరజీవులు బండారు చంద్రరావును, బత్తుల భీష్మారావును హత్యచేసిన సంఘటనలో రాజయ్యపైనా దాడి చేశారు. అయినప్పటికీ ఆయన వెరవలేదు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యునిగా, గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షునిగా రాజయ్య విశేష సేవలందించారు.


ప్రకృతి సిరి.. రంపచోడవరం

(మొదటి పేజీ తరువాయి..) నడుస్తున్నాయి. రంపచోడవరం నియోజకవర్గ కేంద్రం నుంచి చింతూరు, ఎటపాక, విఆర్.పురం, కూనవరం, మారేడుమిల్లి మండలాలకు లోకల్ సర్వీసులు కూడా లేకపోవడంతో జనం అవస్థలు పడుతున్నారు. ఈ నియోజకవర్గంలోని పోలవరం నిర్వాసితుల గోడు పాలకులకు పట్టడం లేదు. ప్రాజెక్టు కోసం ఇళ్లను, భూములను త్యాగం చేసిన లక్షలాది మందిని ప్రభుత్వాలు గాలికొదిలేయడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ముఖ్యంగా గోదావరి వరదల సమయంలో ఇక్కడి నిర్వాసితులు దినదినగండంగా బతుకుతున్నారు. వారికి పరిహారం, పునరావాసం కల్పించాల్సిన బాధ్యతను పాలకులు విస్మరించడం బాధాకరం. ప్రజాప్రతినిధులు, అధికారులు ఇప్పటికైనా ప్రజా సమస్యలు తెలుసుకుని, అభివృద్ధి ప్రణాళికలు తయారుచేసి ప్రజల సహకారంతో ముందుకెళ్లాలి. అప్పుడే నియోజకవర్గ అభివృద్ధి సాధ్యం.

చీకుధారను చూసొద్దామా..!

ప్రజాశక్తి - రాజవొమ్మంగి

అల్లూరి జిల్లా రాజవొమ్మంగి మండలంలోని లోతట్టు గ్రామమైన అమ్మిరేకుల శివారులో ఉన్న చీకుధార జలపాతం పర్యాటకులను అబ్బుర పరుస్తోంది. ఈ జలపాత ప్రాంతం ఎంతో ఆహ్లాదకరంగా ఉంటుంది. పర్యాటకులు అక్కడకు నిశ్చితంగా వెళ్లి రావొచ్చు. వర్షాలు కురిసే రోజుల్లో ఈ వాటర్ ఫాల్ మరింత అందంగా కనిపిస్తుంది. వీటిని తిలకించేందుకు సుదూర ప్రాంతాల నుంచి పర్యాటకులు వస్తుంటారు. రహదారి మార్గం సక్రమంగా లేకపోయినా రాజవొమ్మంగి గ్రామం నుంచి ఎనిమిది కిలోమీటర్ల దూరంలో ఉన్న ఈ వాటర్ ఫాల్‌ను తిలకించడానికి పర్యాటకులు మక్కువ చూపుతున్నారంటే వీటి అందం ఏపాటిదో ఇట్టే అర్థం చేసుకోవొచ్చు. ఎత్తైన చెట్లు, ఔషధ గుణాలు కలిగిన మొక్కల నడుమ పర్వత శిఖరం నుంచి దుమికే ఈ జలపాతాన్ని చూసి వారంతా మురిసి పోతారంటే అతిశయోక్తి కాదు. చిన్నా పెద్దా అన్న తారతమ్యం లేకుండా ఈ జలాపాతం వద్ద జలకాలాడటం పరిపాటి.



చీకుధార జలపాతం

ఇక్కడ మరిన్ని వసతులను ప్రభుత్వం సమకూర్చి, రహదారిని బాగుచేసి రవాణా సదుపాయాలను మెరుగుపరిస్తే పర్యాటకుల సంఖ్య మరింత పెరిగే అవకాశముంది. ఈ జలపాతం వద్ద ఉన్న శివలింగాన్ని పర్యాటకులు చూసి తరిస్తారు. కార్తీకమాసంలో ఇక్కడ పండగ వాతావరణం నెలకొంటుంది.

విప్పతో లాభం

ఆదివాసీలకు ఆదాయ వనరు



పిక్కల నుండి విప్ప పప్పు తీస్తున్న దృశ్యం


ప్రజాశక్తి - చింతూరు

గిరిజన ప్రాంతంలో విప్ప ఎంతో ప్రాముఖ్యతను సంతరించుకుంది. విప్ప చెట్టు నుండి శీతాకాలంలో విప్ప పూలు. వేసవిలో విప్ప కాయలు ఆదివాసీలకు అపార లాభాలు చేకూర్చేవిగా ఉంటాయి. విప్ప పూలను గిరిజనులు సీజన్లో సేకరించి ఎండలో ఆరబెట్టి నిల్వ ఉంచుతారు. ఆపై వాటిని విక్రయించి లాభాలను పొందుతారు. మరికొందరు విప్ప పూల నుంచి సారా తయారుచేసి వివాహాది శుభకార్యాల్లో వినియోగించి వారి అతిథులకు మర్యాదపూర్వకంగా విప్ప పూలతో తయారైన మద్యాన్ని అందిస్తారు. అంతేకాకుండా విప్ప పూలు భద్రాద్రి రాముల వారి ప్రసాదంగా కూడా ఎంతో ప్రాముఖ్యతను కలిగి ఉంది. వేసవిలో విప్ప కాయలు సేకరించిన గిరిజనులు వాటిని బండరాళ్లతో నలగ కొట్టి అందులో ఉన్న పప్పును సేకరించి ఎండలో ఆరబెడతారు. బాగా ఎండిన విప్ప బద్దలను బస్తాలలో నింపి మార్కెట్లో విక్రయిస్తారు. కిలో రూ.50 చొప్పున విప్ప బద్దలను విక్రయించి మంచి లాభాలను పొందుతున్నారు.

ఆయుర్వేదంలో విప్ప పప్పు వినియోగిస్తారు. అదేవిధంగా వివిధ పూజా కార్యక్రమాల్లో విప్ప పప్పు నుంచి తీసిన నూనెను వాడుతారు. అంతేకాకుండా ఈ ప్రాంత గిరిజనులు విప్ప నూనెను పిండి వంటలు ఇతర వంటకాల్లో విరివిగా ఉపయోగిస్తారు. విప్ప నూనె వాడటం వలన శరీరంలో ఉన్న చెడు కొవ్వు కరిగిపోతుంది. మధుమేహ వ్యాధి రాకుండా కాపాడుతుంది. సబ్బుల తయారీలో కూడా విప్పనూనె తీసిన తర్వాత మిగిలిపోయిన పిప్పిని వినియోగిస్తారు. గుండె సంబంధిత వ్యాధులు రాకుండా విప్ప నూనె వినియోగిస్తారు. పూర్వం గిరిజనులు విప్ప కాయలను సేకరించి వాటిని తొలిచి చక్క కానుగలో వేసి నూనె తీసేవారు. ప్రస్తుత పరిస్థితుల్లో యంత్రాల ద్వారా అధిక మొత్తంలో నూనె తీసి పలు రకాల ఆరోగ్య ఔషధ తయారీల్లో వినియోగిస్తున్నారు. ఇన్ని రకాల ఉపయోగాలు ఉన్న విప్ప ఆదివాసీలకు ప్రకృతి అందించిన ఒక వరం. క్రమేపి అడవులను విచక్షణారహితంగా నరికి వేయడంతో విప్ప చెట్లు అంతరిస్తున్నాయి. అడవులను కాపాడి మానవ మనుగడను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉంది.



విప్ప పువ్వులు సేకరించిన గిరిజన బాలుడు



అమ్మకానికి సిద్ధం చేసిన విప్పపువ్వు

ప్రకృతి అందించిన వరం.. పాల పళ్లు

ప్రజాశక్తి - చింతూరు

మండలంలో మార్చి మొదలు ఏప్రిల్ వరకూ అడవుల్లో ప్రకృతి పరంగా అందే ఫలాల్లో పాలపళ్ల ప్రధానమైనవి. ఈ సీజన్లో గిరిజనులు పాల పండ్లు సేకరిస్తుంటారు. చూడటానికి వేపకాయల్లా ఉండే పాల పళ్లు రుచిలో మాత్రం పాలు తేనె కలిపి తింటే ఎంత మధురంగా ఉంటుందో అంతకంటే అధికమైన రుచిని కలిగి ఉంటాయి. ముఖ్యంగా పాలపళ్లలో పలు పోషక విలువలతో కూడిన విటమిన్స్ ఉంటాయి. అడవిలో సేకరించిన పాల పండ్లను గ్లాసు రూ.5 చొప్పున గిరిజన మహిళలు విక్రయిస్తుంటారు. వెదురు బుట్టల్లో వీటిని పెట్టుకుని ధూళి పడకుండా జాగ్రత్త తీసుకుంటారు. వీటిపైన జిగురు ఉంటుంది కాబట్టి ధూళి పడకుండా విక్రయిస్తుంటారు. బాలింతలు పాల పండ్లను ప్రతిరోజూ తింటే పాలు వద్ధి చెందుతాయని పూర్వీకులు తెలిపారు. కేవలం ఈ ఒక్క నెలలో మాత్రమే పాల పండ్లు లభిస్తాయి.



అమ్మకానికి సిద్ధం చేసిన పాల పండ్లు



పాల పండ్లు విక్రయిస్తున్న గిరిజన మహిళలు

ప్రకృతి రమణీయం మారేడుమిల్లి

ప్రజాశక్తి-మారేడుమిల్లి

సహజ సిద్ధమైన అటవీ అందాలకు, జలజల పారే సెలఖ్ళు, రా రమ్మని పిలిచే ప్రకృతి రమణీయ దృశ్యాలకు పుట్టినిల్లు అల్లూరి సీతారామరాజు జిల్లా రంపచోడవరం, మారేడుమిల్లి ప్రాంతాలు. ఇక్కడి ప్రకృతి అందాలు పర్యాటకులను కట్టి పడేస్తాయి అనడంలో అతిశయోక్తి లేదు. తూర్పుగోదావరి జిల్లా, రాజమండ్రికి 59 కిలోమీటర్ల దూరంలో భద్రాచలం వెళ్లే మార్గంలో రంపచోడవరం, మరో 25 కిలోమీటర్లు దూరంలో మారేడుమిల్లి ప్రాంతాల్లో తూర్పు కనుమల అటవీ అందాలను తనివితీరా ఆస్వాదించవచ్చు. మారేడుమిల్లిలో వ్యూపాంట్లు అద్భుతంగా ఉంటాయి. డీప్ ఫారెస్ట్‌లోనికి వెళ్లే కొలది దారిపొడవునా అడవి జంతువులు, అరుదుగా పులులు, పక్షులు కనిపిస్తాయి. మారేడుమిల్లి అడవులను ఒకప్పుడు అల్లూరి సీతారామరాజు తన స్థావరంగా ఉపయోగించారు. ఈ ప్రాంతంలో జలపాతాలు, ప్రకృతి అందాలను ఒకసారి తెలుసుకుందాం పదండి..!

రంపచోడవరం మన్యం ప్రాంతంలోనికి అడుగుపెట్టగానే పర్యాటకులు తొలిత సీతపల్లి గడి బాపనమ్మ అమ్మవారి ఆలయాన్ని సందర్శిస్తారు. ఐ.పోలవరం గ్రామ సమీపంలో ఉన్న పార్క్ పర్యాటకులను ఎంతగానో ఆకట్టుకుంటుంది. అలాగే రాజమండ్రి నుండి వచ్చే పర్యాటకులకు ముందుగా రంపచోడవరం మండలంలోని రంప గ్రామంలో కొండపై నుండి జాలువారే రంప జలపాతం దర్శనమిస్తుంది. ఈ జలపాతంలో స్నానం చేసి అక్కడే గుహలో శివుని విగ్రహాన్ని దర్శించుకుంటూ ఉంటారు.

నందనవనం


మారేడుమిల్లికి 5 కిలోమీటర్లు దూరం ఉన్న నందవనం బేంబూ చికెన్, ఔషధ మొక్కల తోటలకు ప్రసిద్ధి. ఇదికూడా సహజ అందాల కోవకే చెందినదే. అయితే సరైన నిర్వహణ లేదు. తూర్పు కనుమలు, ఒరిస్సా నుంచి తీసుకొొచ్చిన మొక్కలను సందర్శనకు ఇక్కడ ఉంచారు.

వాలీ సుగ్రీవ వాన మూలికల ప్రదేశం

నందనవనానికి దగ్గరిలోనే వాలీ సుగ్రీవ మెడిసినల్ ప్లాంట్ కన్వర్వేషన్ ఏరియా ఉంది. ఇది ఎత్తుపల్లాల భూభాగం. సుమారు 260 హెక్టార్లలో విస్తరించిన ఈ ఏరియాలో 230 రకాల అరుదైన మొక్కలను గుర్తుంచారు. ఇది కూడా సందర్శించదగినదే.

కార్తీకవనం

దీనికి దగ్గరిలో కార్తీకవనం ఉంది. ఇది మొక్కలతో నిండిన ఒక ఆధ్యాత్మిక ప్రదేశం. ముఖ్యంగా కార్తీక మాసంలో ఇక్కడ వనభోజనాలు పెద్ద ఎత్తున నిర్వహిస్తారు. రావి, వేప, ఉసిరి, మర్రి, బిల్వ మొక్కలు ఎక్కువగా కనిపిస్తాయి.



గుడిస హిల్ స్టేషన్ వద్ద పాల సముద్రాన్ని తలపించే రమణీయ దృశ్యం

కాఫీ, మిరియాలు తోటలు

మారేడుమిల్లి చుట్టు పక్కల చూడవలసిన మరో స్పాట్ కాఫీ తోటలు. కాశ్మీరు తరువాత కాఫీ తోటలు చూడాలంటే మారేడుమిల్లి రావాల్సిందే. ఈ కాఫీ తోట మధ్యలో మిరియాల తోటలు దర్శనమిస్తాయి. వీటితో పాటు చెట్లు, పొదలు, వివిధ పండ్ల తోటలు కూడా చూడవచ్చు.

పాములేరు వాగు

మారేడుమిల్లికి సుమారు 10 కిలోమీటర్ల దూరంలో భద్రాచలం వెళ్లే మార్గంలో ఉన్న మరో పర్యాటక ప్రదేశం పాములేరు వాగు. ఈ వాగు చూడడానికి పాము లాగా మెలికలు తిరుగుతూ చాలా ప్రశాంతంగా కనిపిస్తుంది. ఈ వాగులో మొసళ్లు ఉన్నాయి. ఈ వాగు లోతు తెలియక ఇందులో దిగి పలువురు ప్రాణాలు కోల్పోయారు. దీంతో ఇక్కడకి వచ్చే పర్యాటకులు ఈ వాగులోకి దిగడాన్ని నిషేధించారు.



అటవీశాఖ వారి వనవిహారి ఎకో రిసార్ట్స్

జంగిల్ స్టార్ రిసార్ట్స్

పాములేరు వాగుకు దగ్గరిలో జంగిల్ స్టార్ క్యాంప్ సైట్‌కి రామాయణానికి మధ్య లింక్ ఉంది. ఇక్కడ రామాయణ కాలంలో యుద్ధం జరిగినట్లు భావిస్తుంటారు. క్యాంప్ సైట్ పక్కనే మూడు వైపుల నుంచి ప్రవహించే వాలమూరు నది ఉంది. గడ్డి మైదానాలు, కొండలు, అడవులు... చెప్పాలంటే తూర్పు కనుమల అందాలన్నీ ఇక్కడే ఉన్నాయా? అన్నట్టు అనిపిస్తుంది.

టైగర్ క్యాంపు

మారేడుమిల్లి నుండి సుమారు 20 కిలోమీటర్ల దూరంలో టైగర్ క్యాంపు అడవిలో ఉంది. అడవి జంతువులు, పక్షులు ఎక్కువగా ఉంటాయి. అక్కడికి వెళితే పులుల గాండ్రింపులు వినవచ్చు.

జలపాతాలు

స్వర్ణధార, అమృతధార అనేవి మారేడుమిల్లిలో చూడవలసిన మరికొన్ని జలపాతాలు. ఇలా ఎన్నో మారేడుమిల్లిలో చూడవలసిన ఆకర్షనీయ ప్రదేశాలు ఉన్నాయి.

జలతరంగిణి

మారేడుమిల్లికి 7 కిలోమీటర్ల దూరంలో జలతరంగిణి జలపాతం ఉంది. పెద్ద రాయి మీద నుండి నిత్యం ఊరకలేస్తూ నీరు ప్రవహిస్తుంది. ఈ జలపాతం లోతు ఉండదు. దీంతో ఇక్కడకి వచ్చిన పర్యాటకులు స్నానం చేసి సేదతీరుతారు.

అమృతధార

మారేడుమిల్లికి సుమారు 18 కిలోమీటర్ల ఘాట్ రోడ్డులో కొద్ది దూరం వెళితే కనిపించే మరో అద్భుతం అమృతధార జలపాతం. ఈ జలపాతం వద్దకు వెళ్లాలంటే కొద్దిగా సాహసమనే చెప్పాలి. కొండపై నుండి కొంత లోయలోకి దిగాల్సి ఉంటుంది. అయితే అక్కడకు వెళ్ళడానికి పడిన శ్రమ ఆకాశం నుండి జాలువారుతున్నట్టు కనిపించే జలపాతం అందాలు చూడగానే మాయమైపోతుంది.

వ్యూ పాయింట్స్

మారేడుమిల్లికి సమారు 15 కిలోమీటర్ల దూరంలో మన్యం వ్యూ పాయింట్, చింతూరు మండలం తులసిపాక గ్రామ సమీపంలో సోకేలేరు వ్యూ పాయింట్ ఉన్నాయి. ఈ ప్రదేశాల నుండి చుట్టు పక్కల అందాలను వీక్షించవచ్చు.

గుడిస హిల్ స్టేషన్

మారేడుమిల్లికి సుమారు 50 కిలోమీటర్ల దూరం మారేడుమిల్లి మండలం పుల్లంగి పంచాయతీ గుడిస గ్రామం ఉంది. ఇక్కడ ఎత్తైన కొండ ప్రాంతం ఎంతో ఆకర్షించేవిధంగా ఉంటుంది. ఇది గుడిస పర్యాటక కేంద్రంగా పేరుపొందింది. శీతాకాలంలో తెల్లవారుజామున పాల సముద్రాన్ని తలపించేలా, భూమి ఆకాశం ఒక్కటైందా అన్న విధంగా పొంగ మంచు కొండలపై కమ్మేస్తుంది. దీనిని తిలకించడానికి ఎపితో పాటు పలు రాష్ట్రాల నుండి అధిక సంఖ్యలో పర్యాటకులు వస్తూ ఉంటారు. తెల్లవారుజామున మంచు అందాలను, ఆ సమయంలో సూర్యోదయాన్ని చూడటానికి రాత్రి అక్కడే టెంట్లు వేసుకొని స్టే చేస్తారు.

ఎప్పుడు సందర్శించాలి?

మామూలుగా ఐతే మారేడుమిల్లిని వర్షాకాలం తరువాత సందర్శించాలి. వర్షాకాలంలో వర్షాలు అధికంగా ఉంటాయి కాబట్టి అడవుల్లో జారిపడే అవకాశం లేకపోలేదు. ఈ ప్రదేశం సంవత్సరం పొడవునా రాత్రిళ్ళు చల్లగా, ఉదయం వేడిగా ఉంటుంది. వేసవిలో సందర్శన ఒక కొత్త అనుభూతిని ఇస్తుంది.

మిగతా 8లో...



బర్డ్స్ నెస్ట్ రిసార్ట్‌లో స్విమ్మింగ్ పూల్

ప్రకృతి రమణీయం మారేడుమిల్లి

7వ పేజీ తరువాయి..

ఎక్కడ స్టే చేయాలి?

రంపచోడవరంలో అయితే ప్రైవేటు రిసార్ట్స్ చాలానే ఉన్నాయి. ఫారెస్ట్ డిపార్ట్మెంట్ వారు నిర్వహించే రిసార్ట్‌లు కూడా అందుబాటులో ఉన్నాయి.

బర్డ్స్ నెస్ట్ రిసార్ట్స్ అండ్ టూరిజం

రంపచోడవరం మారేడుమిల్లికి మధ్యలో ఉన్న సున్నంపాడు గ్రామానికి 3 కిలోమీటర్ల దూరంలో బర్డ్స్ నెస్ట్ అనే ప్రైవేటు రిసార్ట్స్ ఉంది. ఇక్కడికి వచ్చే పర్యాటకులకు ఎటువంటి ఇబ్బంది కలుగకుండా బర్డ్స్ నెస్ట్ రిసార్ట్స్ వారు భోజనం తయారు చేస్తారు. స్విమ్మింగ్ పూల్, వాగులో బోటింగ్, చిన్నపిల్లలు ఆడుకొనే పరికరాలు ఇక్కడ అందుబాటులో ఉన్నాయి. దీంతో పాటు రంపచోడవరం మండలంలో ఆర్కా రిసార్ట్స్, మారేడుమిల్లి మండలంలో సెవెన్ హిల్స్ రిసార్ట్స్, డ్రీమ్ వ్యాలీ రిసార్ట్స్, సత్య గౌరి రూమ్స్, సత్య రూమ్స్, విజయ రెసిడెన్సీ వంటి ప్రైవేటు రిసార్ట్స్, హోటళ్లు అనేకం ఉన్నాయి.

అటవీశాఖ ఎకో రిసార్ట్స్

అలాగే ఆంధ్రప్రదేశ్ అటవీ శాఖ వారు ఎకో- టూరిజం ప్రాజెక్ట్‌లో భాగంగా వనవిహారి ఎకో రిసార్ట్, జంగిల్ స్టార్ ఎకో రిసార్ట్స్‌ను నిర్వహిస్తున్నారు. వనవిహారి రిసార్ట్‌లో చాలా గదులు అద్దెకు లభిస్తాయి. ఇందులో ఏసీ, నాన్ ఏసీ గదులు అందుబాటులో ఉన్నాయి. జంటలకు, చిన్న చిన్న గ్రూప్‌లుగా వచ్చేవారికి ఈ రిసార్ట్ సూచించదగినది. జంగిల్ స్టార్ రిసార్ట్ 10 -20 మంది కలిసి గ్రూప్‌లుగా వచ్చేవారికి సూచించదగినది. టెంట్ వసతి, రాత్రుళ్ళు చలి మంటలు ఇక్కడి ప్రత్యేకతలు. ఫుడ్ ఊరికి దూరంగా ఉండటం ప్రతికూలతగా చెప్పవచ్చు.

బేంబో చికెన్

మారేడుమిల్లిలో బేంబో చికెన్ ప్రత్యేక వంటకం. ఎదురు బొంగులో చికెన్ వేసి మంటలో కాలుస్తారు. దీని రుచి స్టార్ హోటళ్ళలో కూడా రాదు. అంత బాగుంటుంది. ఒక్క చుక్క కూడా ఆయిల్ వాడకుండా తయారు చేసే ఈ చికెన్‌ను తప్పకుండా రుచి చూడాలి. మారేడుమిల్లి, రంపచోడవరంలో చిన్న చిన్న హోటళ్లు అనేకం ఉన్నాయి. మారేడుమిల్లిలో తినటానికి సూచించదగిన




గుడిస హిల్ స్టేషన్‌కు వెళ్లే మార్గం

ప్రదేశం వనవిహారి రిసార్ట్ క్యాంటీన్. ఇక్కడ ఫుడ్ అమోఘం. ఇక్కడ బేంబో చికెన్ రుచి చూడొచ్చు. బేంబో చికెన్ తినటానికి స్పెషల్‌గా హోటల్ అంటూ ఏదీ లేదు. అన్ని హోటళ్ళలో ఈ చికెన్ వండుతారు.

టూర్ ప్యాకేజీలు

మారేడుమిల్లికి టూర్ ప్యాకేజీలు ఉన్నాయి. మారేడుమిల్లి, రంపచోడవరం ట్రావెల్ ఏజెంట్‌నైనా సంప్రదించి రెండురోజుల పాటు వనవిహారంలో ఉండవచ్చు. కొన్ని ట్రావెల్ సంస్థలు గైడ్‌ను పెట్టి వసతి, భోజనాలు, రవాణా సదుపాయాలను కల్పిస్తున్నాయి.

మైమరిపిస్తున్న పింజరికొండ జలపాతం



ప్రజాశక్తి - అడ్డతీగల

తూర్పు ఏజెన్సీలో పర్యాటకులను ఆకర్షించే పర్యాటక ప్రదేశం పింజరికొండ. ఈ జలపాతానికి రాజమండ్రి నుంచి 45 కిలోమీటర్లు, గోకవరం నుంచి 20 కిలోమీటర్లు, ఏజెన్సీ గంగవరం నుంచి మరో 12 కిలోమీటర్లు, అడ్డతీగల మండల కేంద్రం నుంచి ప్రయాణం చేసి ఈ పర్యాటక కేంద్రానికి చేరుకోవచ్చు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా, పశ్చిమగోదావరి జిల్లా, కృష్ణ జిల్లాల నుంచి ఈ జలపాతం వద్దకు వేలాదిమంది పర్యాటకులు వస్తూ ఉంటారు. ఈ పర్యాటక కేంద్రంలో సుమారుగా 100 అడుగులు ఎత్తు నుంచి నీరు కిందకి జాలువారుతూ ఉంటుంది. ఈ అందాలను తిలకించడానికి కార్తీకమాసంలో పర్యాటకులు తాకిడి ఎక్కువగా ఉండడంతో ఈ జలపాతం వద్ద భద్రతా ఏర్పాట్లు చేశారు. గతంలో ఎన్నో ప్రమాదాలు జరిగినా పర్యాటకులు మాత్రం తగ్గలేదని ఈ ప్రాంత ప్రజలు చెబుతున్నారు. ఈ జలపాతం వద్ద ప్రకృతి సిద్ధంగా వెలిసిన పురాతన శివాలయం ఉంది. ఆ శివాలయం వద్దకు పూర్వకాలం నుంచి కూడా సంతానం లేని వారు వచ్చి మొక్కుకుంటే పిల్లలు పుడతారని నమ్మకం ఉంది. శివరాత్రి రోజున ఎక్కడ నుంచి ఎంతమంది వచ్చినా పింజరి కొండ గ్రామస్తులు కమిటీగా ఏర్పడి భోజనాలు ఏర్పాటు చేస్తారు. ఆదివాసీల సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపడే విధంగా కళాజాతాలను ఏర్పాటు చేస్తారు. ప్రస్తుతం జలపాతం వద్ద మినీ పవర్ ప్లాంట్ నిర్మాణం చేయడంతో కాస్త ఇబ్బందులు కలుగుతున్నాయని పర్యాటకులు చెబుతున్నారు.